మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

# గన్నీ బ్యాగుల సంగతేంటి..?

- దోషులను వెనుకేసుకొస్తున్న పెద్ద నాయకుడు ఎవరు..?
- దోషులు ఎవరో తెలిసిన ఎందుకు వెల్లడించడం లేదు..?
- నాగేశ్వర్ రావును కలిసి వినతిపత్రం అందజేస్తాం..!
- జిల్లా అధ్యక్షుడు వనం తిరుపతయ్య యాదవ్..!




సమావేశంలో మాట్లాడుతున్న బిసి పొలిటికల్ జేఏసీ నాయకులు

**పెబ్బేరు, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** పది నెలలు గడుస్తున్నా పెబ్బేరు మార్కెట్ యార్డు గోదాం అగ్ని ప్రమాద ఘటనకు కారకులైన ఇంత వరకు తేల్చలేదని, వెంటనే దోషులను తేల్చాలని బీసీ పొలిటికల్ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పెబ్బేరులో నిర్వహించిన ప్రెస్ మీట్లో వారు మాట్లాడారు. దోషులెవరో పోలీసులకు, రాజకీయ నేతలకు తెలిసినా వారి పేర్లు బయటికి చెప్పకుండా ఎండలు అధికంగా ఉండటంతోనే ఖాళీ సంచులకు నిప్పంటుకొని ప్రమాదం సంభవించిందని పెబ్బేరు ఎస్సై, సీఐ, డీఎస్పీలు జిల్లా ఎస్పీకి ఫైనల్ రిపోర్టు ఇవ్వడం విడ్డూరంగా ఉందని చెప్పారు. ఆ ఘటనలో పూర్తిగా కాలిపోయిన గోదామును బాగు చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం సంతోషించాల్సిన విషయమే అయినా దోషుల విషయాలు మాత్రం నిగ్గు తేల్చాల్సిందేనని చెప్పారు. శనివారం పెబ్బేరుకు రానున్న వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసి వినతిపత్రం ఇస్తామని చెప్పారు. పోలీసులు మరోసారి పునర్విచారణ చేసి దోషులను తేల్చకపోతే తామే ఆ దోషులెవరో తేల్చాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరిక చేశారు. ప్రభుత్వం కోట్లు వెచ్చించి రైతుల కోసం ఎన్నో నిర్మాణాలు చేస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలి. కాని దుర్వినియోగానికి పాల్పడవద్దని చెప్పారు. కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు వనం తిరుపతయ్య, రాష్ట్ర కార్యదర్శి వజగౌని వెంకటయ్య గౌడ్, ఆర్టీఐ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్, జిల్లా కార్యదర్శి జితేందర్ గౌడ్, వసంత చారి తదితరులు పాల్గొన్నారు.

# కష్టపడితేనే ఫలితం

## ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



విద్యార్థులకు డిజిటల్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** కష్టపడితేనే ఫలితం ఉంటుందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. మహబూబ్ నగర్ నియోజకవర్గంలోని హన్వాడ మండలం మునిమోక్షం, గొండ్యాల , వేపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో మరియు మహబూబ్‌నగర్ పట్టణం లోని జయశ్రీ హైస్కూల్, లుంబిని హైస్కూల్‌లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు ఎమ్మెల్యే తన సొంత నిధులతో 2డి, 3డి యానిమేటెడ్ డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్స్‌ను ఉచితంగా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల రోజులపాటు చదువుపైన దృష్టి సారించాలని, ఇంతవరకు జరిగిన పాఠ్యాంశాలను మళ్ళీ ఒకసారి రివిజన్ చేసుకొని మీరంతా పదవ తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆయన విద్యార్థులకు సూచించారు. ఈ ముప్పై రోజుల పాటు ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల పైన ప్రత్యేక దృష్టి పెట్టాలని, వారికి వచ్చే సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలని ఆయన సూచించారు. ఇంటర్మీడియట్ విద్యను ప్రభుత్వ కళాశాలల్లో చదువాలని అక్కడ కూడా సుశిక్షితులైన అధ్యాపకులు ఉన్నారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గొండ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలను నాటి నీళ్ళు పోశారు. ఈ కార్యక్రమంలో సిఎంఓ బాలు యాదవ్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, వేముల కృష్ణయ్య, టంకర కృష్ణయ్య యాదవ్, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి.మహేందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

## ఉన్ని పారిశ్రామిక సహకార సంఘాన్ని

# బలోపేతం చేసుకుందాం

### వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి



ఉన్ని పారిశ్రామిక సహకార సంఘాన్ని సందర్శిస్తున్నా ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి

**వనపర్తి ప్రతినిధి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** పెద్దమందడి మండలం వెల్టూరు గ్రామంలోని ఉన్ని పారిశ్రామిక సహకార సంఘాన్ని పూర్తిస్థాయి లో బలోపేతం చేసుకుందామని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన వెల్టూర్ చేనేత కాలనీలోని ఉన్ని పారిశ్రామిక సహకార సంఘాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సంఘ భవనంలో రగ్గులను తయారు చేస్తున్న చేనేత కార్మికులతో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ పారిశ్రామిక సహకార సంఘంలో తయారైన రగ్గులకు తుది మెరుగులు ఇక్కడ ఇవ్వలేకపోతున్నామని దానికోసం హర్యానా వెళ్లవలసి వస్తుందని సంఘం చైర్మన్ వెంకటేష్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ఫినిషింగ్ యూనిట్ ఏర్పాటు కోసం నివేదికలు తయారు చేయాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి యూనిట్ మంజూరి కోసం ప్రయత్నం చేస్తానని ఆయన తెలిపారు. కార్మికుల యోగక్షేమాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిసిసిబి జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షులు రామకృష్ణారెడ్డి, ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మంత్రుల రాక సందర్భంగా ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే నేడు పలు అభివృద్ధి కార్యక్రమాల భూమి పూజల నిమిత్తం వనపర్తి నియోజకవర్గానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు, ఎక్సైజ్, టూరిజం శాఖ మాత్యులు జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి వస్తున్న సందర్భంగా ఆయా కార్యక్రమాల ఏర్పాట్లను శుక్రవారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పరిశీలించారు.

## కేంద్ర ప్రభుత్వ నిధుల ఖర్చు నివేదికలు ఇవ్వాలి : జిల్లా కలెక్టర్



సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి టౌన్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం ద్వారాజిల్లాకు మంజూరైన పి.యం శ్రీ (పిఎంఎస్ఆర్ఐ), సర్వ శిక్ష అభియాన్ కింద మంజూరైన నిధులను వందశాతం ఖర్చు చేసి నివేదికలు ఇవ్వాలని జిల్లాకలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులతో కేంద్ర ప్రభుత్వ నిధుల వినియోగం పై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. పి.యం శ్రీ, సర్వ శిక్ష అభియాన్ కింద ప్రతి సంవత్సరం పాఠశాలల్లో మౌలిక వసతులు, క్షేత్రస్థాయి పరిశీలనలకొరకు విడుదలైన నిధులు ఖర్చు చేసి యూటిలైజేశన్ సర్టిఫికెట్ పంపాలని తెలిపారు. అనంతరం కలెక్టర్ సమీక్ష నిర్వహిస్తూ గ్రీన్ స్కూల్, ఆత్మ రక్షణ, క్షేత్ర స్థాయి పరిశీలన, మౌలిక సదుపాయాలు, స్పోర్ట్స్, సైన్స్ బడ్జెట్ వినియోగంపై సమీక్షించడం జరిగింది. నిధులు ఖర్చు చేసి నివేదిక ఇవ్వాలని, ఆపార్ నమోదు సైతం త్వరగా పూర్తి చేయాలని యం.ఈ.ఒలను ఆదేశించారు. జిల్లా విద్యా శాఖ అధికారి అబ్దుల్ ఘనీ, మండల విద్యా అధికారులు, పి.యం శ్రీ ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# పన్నెండు నెలల్లో ఎంతో అభివృద్ధి చేశాం

- అధికారంలోకి రాగానే 55 వేల ఉద్యోగాలు ఇచ్చాం
- ఏడాదికి 5 లక్షల ఇండ్లు ఇస్తున్నాం
- రాబోయే రోజుల్లో దేశంలోనే రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలుపుతాం
- నారాయణపేట ప్రజా పాలన ప్రగతి బాట సభలో సీఎం రేవంత్ రెడ్డి



మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త : 12 నెలల్లో రాష్ట్రంలో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని ఈ విషయంలో ప్రతిపక్షాలతో చర్చకు సిద్ధమని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. శుక్రవారం నారాయణ పేట జిల్లా పర్యటన సందర్భంగా దాదాపు రూ. 1000 కోట్ల వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి అప్పక్‌పల్లిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. ఆడ బిడ్డలకు ఆలంబన ఇవ్వాలని దేశంలో ఎక్కడ లేని విధంగా నేడు మహిళా సమాఖ్యాల ద్వారా పెట్రోల్ బంక్ నడిపించుకునే విధంగా పెట్రోల్ బంక్ ప్రారంభోత్సవం చేసుకోవడం జరిగిందన్నారు. ఆనాడు కాంగ్రెస్ హయంలో రూ. 25 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తే ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం 10 సంవత్సరాలు బడుగు బలహీన వర్గాల ప్రజలను విస్మరించిందని విమర్శించారు. తిరిగి ఇప్పుడు ప్రభుత్వం ఏర్పాటు చేశాక ప్రతి నియోజక వర్గానికి 3500 ఇళ్ల చొప్పున రాష్ట్రంలో 5 లక్షల ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేసుకొని నారాయణపేట నుంచి భూమి పూజ చేసుకోవడం జరిగిందన్నారు. అవసరం అనుకుంటే నియోజకవర్గానికి 5 వేలకు పెంచుతామని పేర్కొన్నారు. హైదారాబాద్ రాష్ట్రానికి పాలమూరు జిల్లావాసి బూర్గుల రామకృష్ణరావు తొలి ముఖ్యమంత్రిగా పనిచేస్తే దాదాపు 7 దశాబ్దాల తర్వాత తిరిగి పాలమూరు బిడ్డకు ముఖ్యమంత్రి అయ్యే అవకాశం వచ్చిందన్నారు. ఈ అవవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వెనకబడ్డ ఈ పాలమూరు జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుంటానని హామి ఇచ్చారు. పాలమూరు జిల్లా గుండా సంవత్సరానికి 811 టి.యం.సి ల నీరు పోతుంటే పాలమూరు ప్రాజెక్టులు పూర్తి చేయకుండా జిల్లాను ఎందుకు నిర్లక్ష్యం చేశారని ప్రశ్నించారు. పాలమూరు జిల్లా తెలంగాణ రాష్ట్రంలో లేదా అని ప్రశ్నించారు. పాలమూరు రంగారెడ్డి, భీమా, నెట్టెంపాడు, తుమ్మిళ్ల, ఆర్‌డిఎస్, కల్వకుర్తి, కోయిల్ సాగర్ ప్రాజెక్టులను పూర్తిచేయకుండా 10 ఏళ్ల నిర్లక్ష్యం చేశారని ఎద్దేవా చేశారు. పైగా పోతిరెడ్డిపాడు, ముచ్చుమర్రి ప్రాజెక్టుల ద్వారా రాయలసీమకు నీళ్ల తరలించుకుపోయేందుకు అవకాశం కల్పించారని పరోక్షంగా మాజీ సీఎం కేసిఆర్ ను ఉద్దేశించి విమర్శించారు. మక్తల్, కొడంగల్, నారాయణపేట ప్రాజెక్టు నిర్మాణానికి 2014లో కోట్లాడి మంజూరు చేయిస్తే తనపైన ఉన్న కోపంతో ప్రాజెక్టు నిర్మాణం చేపట్టకుండా ఆపేశారని అన్నారు. ఇప్పుడు తన హయాంలో ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఉదండాపూర్, పాలమూరు రంగారెడ్డి, ప్రాజెక్టులను పూర్తి చేసి సాగు, తాగునీరు అందిస్తామని హామి ఇచ్చారు. లగచర్లలో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తే అడ్డుకున్నారని, పాలమూరు జిల్లాను అభివృద్ధి చేసుకుంటే ఎందుకు అక్కసు వెళ్లగక్కుతున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వం ఏర్పడి కేవలం 12 నెలలు పూర్తి అయ్యిందని, భారాస ప్రభుత్వం చేసిన 10 సంవత్సరాల పాలన, కేంద్రంలో 12 సంవత్సరాల మోడీ ప్రభుత్వం పాలన పై బహిరంగ చర్చకు సిద్ధమని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేసే బాధ్యత నాదని, నన్ను కాపాడుకునే బాధ్యత ప్రజల పై ఉందని అన్నారు. ఈ సభలో పాల్గొన్న రాష్ట్ర ఇన్చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ ఆగష్టు 1, 2024 న సుప్రీం కోర్టు ఇచ్చిన సూచనల మేరకు 120 రోజుల్లో విజవంతంగా కుల గణన పూర్తి చేయడం జరిగిందని దానితో పాటు వర్గీకరణ పూర్తి చేసి అన్ని విధాలుగా వెనుకబడిన మాదిగ కులానికి 9.7 శాతం రిజర్వేషన్ ఇవ్వబోతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు మాత్రమే అవుతుందని ఈ 14 నెలల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేశామని తెలిపారు. 10 సంవత్సరాల పరిపాలన చేసిన గత ప్రభుత్వం 8 లక్షల కోట్లు అప్పు చేసి మరో 40 వేల కోట్ల పెండింగ్ బిల్లులు పెట్టి ఇచ్చిన హామీలు ఏమయ్యిందినని అడుగుతున్నారని అన్నారు. అభివృద్ధి విషయంలో వేదిక ఎక్కడైనా చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. అంతకు ముందు నారాయణపేట శాసన సభ్యులు చిట్టెం పర్ణికా రెడ్డి, మంత్రులతో కలిసి వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. నారాయణ పేట -మిగతా3లో..



సభకు హాజరైన మహిళలు, కార్యకర్తలు, నాయకులు, ప్రజలు

# విద్యార్థులు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి



విద్యార్థులకు పాఠాలు చెప్పున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి టౌన్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** విద్యార్థులు చక్కగా చదివి, అత్యుత్తమ ఫలితాలు సాధించి తాము చదివిన పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం మాత్రమే అందించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించి జిల్లాకు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం తరఫున చదువుకోవడానికి విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలని చెప్పారు. గురువారం నిర్వహించిన వార్షికోత్సవానికి సంబంధించిన వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులకు స్వయంగా గణితం పై కొన్ని ప్రశ్నలు సంధించి, సమాధానాలు రాబట్టారు. సరైన విధంగా గణిత సమస్యలను పరిష్కరించిన విద్యార్థులకు చాక్లెట్లు అందజేశారు. పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న వంటగది నిర్మాణానికి సంబంధించి ఈ డబ్ల్యూ ఐడిసి ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడారు. పాఠశాలలో ఉన్న పెండింగ్ పనుల పూర్తి చేయడానికి అంచనాల నివేదికను సమర్పించాలని ఆదేశించారు. భవిత కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ భవిత కేంద్రంలోని బాలబాలికలకు ఫిజియోథెరఫీ, స్పీచ్ థెరపీ వంటివి వాటిలో చక్కగా శిక్షణ అందించాలని జిల్లా కలెక్టర్ సిబ్బందికి సూచించారు. స్థానిక కేడిఆర్ నగర్ లోని మండల విద్యాధికారి కార్యాలయంలో భవిత (ప్రత్యేక అవసరాల బాల బాలికల జిల్లా వనరుల కేంద్రం) కేంద్రంను కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. భవిత సెంటర్లో ఉన్న చిన్నారులతో కలెక్టర్ ఆప్యాయంగా మాట్లాడారు. ప్రత్యేక అవసరాల పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడానికి కావాల్సిన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. వారి నైపుణ్యాలను తీర్చిదిద్ది స్పెషల్ స్కూల్ నుంచి నార్మల్ స్కూల్ కు పంపడానికి అన్ని రకాలుగా అవసరమైన విధంగా శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల బాల బాలికలకు ఫిజియోథెరఫీ, స్పీచ్ థెరపీ వంటివి వాటిలో శిక్షణ అందించి ఇతర పిల్లలతో సమానంగా విద్యను అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని భవిత కేంద్రాలకు స్పీచ్ థెరపీకి సంబందించిన పరికరాలు అందిస్తానని కలెక్టర్ చెప్పారు. ఫిజియోథెరపీకి సంబంధించి వైద్య శాఖ నుంచి థెరపిస్టును పిలిపించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. విద్యాశాఖ అధికారులు యుగంధర్, శేఖర్, బాలికల పాఠశాల ప్రిన్సిపల్ ఉమాదేవి, భవిత కేంద్రం సిబ్బంది తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## మంత్రుల రాక సందర్భంగా

# ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే

**పెబ్బేరు, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** నేడు పలు అభివృద్ధి కార్యక్రమాల భూమి పూజల నిమిత్తం వనపర్తి నియోజకవర్గానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు, ఎక్సైజ్, టూరిజం శాఖ మాత్యులు జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, ప్రారంభోత్సవానికి వస్తున్నట్లు ఇద్దరు మండల కాంగ్రెస్ నాయకులు తెలియజేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే పెబ్బేర్ మార్కెట్ యార్డులో నూతనంగా నిర్మించనున్న గోదాన్ల కొత్త గోదాం కోసం 5 కోట్ల 50 లక్షలు, మార్కెట్ ఆఫీసు కోసం 44 లక్షలు, పాత గోదాం పునర్నిర్మాణం కోసం 3 కోట్లు ఈ పనులను ప్రారంభించడానికి మంత్రులు వస్తున్నట్లు తెలియజేశారు. భూమి పూజ కార్యక్రమం ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా పెబ్బేరు మండల, పెబ్బేర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కార్యకర్తలతో ఆయన ప్రత్యేకంగా సమావేశమై ఏర్పాట్లకి సంబంధించిన అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో డిసిసిబి జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, పెబ్బేరు మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు ప్రమోదిని రెడ్డి, వనపర్తి మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షుడు విజయవర్ధన్ రెడ్డి ,నాయకులు బి.రామచంద్ర రెడ్డి, దయాకర్ రెడ్డి, సురేందర్ గౌడ్ ,వెంకటేష్ సాగర్ ,యుగంధర్ రెడ్డి, శ్రీహరి, రాజు, షకీల్ ,టిఎంఆర్ శివ, ఎం రాజేష్, మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వనపర్తి ఎమ్మెల్యే

# ఇంటర్మీడియట్ పరీక్షలు సజావుగా జరగాలి : జిల్లా కలెక్టర్ సంతోష్



అధికారుతో సమీక్ష చేస్తున్న కలెక్టర్ సంతోష్

**గద్వాల, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అధికారులకు ఆదేశించారు. శుక్రవారం ఐడిఓసి కాన్ఫరెన్స్ హాల్ నందు ఇంటర్ విద్య, పాఠశాల విద్య, రెవెన్యూ, పోలీసు, రవాణా, వైద్య ఆరోగ్యం, విద్యుత్, పోస్టల్ తదితర శాఖల అధికారులతో ఇంటర్ పరీక్షల నిర్వహణపై జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 5 నుండి ప్రారంభమయ్యే ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని పరీక్షా కేంద్రాల్లో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో 14 పరీక్షా కేంద్రాల్లో 8,341 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. వీరిలో ఫస్ట్ ఇయర్ స్టూడెంట్లు 4,057, సెకండ్ ఇయర్ 4,284 మంది ఉన్నారన్నారు. పరీక్షలను నిష్పాక్షికంగా నిర్వహించేందుకు చీఫ్ సూపరిడెంట్స్, ఫ్లయింగ్ స్క్వాడ్లు, సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేసి కఠినమైన నిఘా పెట్టాలని తెలిపారు. స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాటు చేసి, ఇందుకోసం కస్టోడియన్, డిపార్ట్మెంటల్ అధికారులను నియమించాలని ఆదేశించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో ముందుగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశిస్తూ, పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ ఉన్నందున జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లోకి ఎవరు సెల్‌ఫోన్ తీసుకురావడానికి అనుమతి లేదని స్పష్టం చేశారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా అవసరమైన మార్గాల్లో బస్సు సర్వీసులు నడిపేలా ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తగిన మందులతో మెడికల్ ఆఫీసర్, ఆంశాలను అందుబాటులో ఉంచాలని వైద్య శాఖ అధికారులను సూచించారు. పరీక్షా సమయంలో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఆర్డీఓ శ్రీనివాసరావు, డిఎస్పీ మొగలయ్య, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి హృదయ రాజు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిద్దప్ప, విద్యుత్ శాఖ అధికారి రమేష్ బాబు, ఆర్టీసీ అధికారి శ్రీనివాసరెడ్డి, విద్యాశాఖ శ్రీనివాస, పోస్టల్ అధికారి అయూబ్ ఖతీబ్, తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలను అరికట్టాలి

**పెబ్బేరు, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** పెబ్బేర్ మండలలో పోలీస్‌స్టేషన్‌లో రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ప్రతినిధి రాజశేఖర్ ఆధ్వర్యంలో బుక్స్, క్యాలెండర్, పోస్టర్స్ రిలీజ్ చేయడం జరిగింది. 18 సంవత్సరాలు నిండని అమ్మాయికి 21 సంవత్సరాలు నిండని అబ్బాయికి పెళ్లిళ్లు చేయకూడదని పిల్లలను బడి మాన్పించి పనిలో పెట్టకూడదని చదువుకోవడం పిల్లల హక్కు అని అమ్మాయిలను వేధించిన మానసికంగా హింసించిన చిన్నారులను అక్రమంగా రవాణాచేసిన ఇలాంటి చట్ట వ్యతిరేకమైన పనులు జరిగినట్లయితే చైల్డ్‌హెల్ప్‌లైన్ నెంబర్1098,112పోలీస్100 లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలి. 2006 బాల్య వివాహాల నిషేధ చట్టం ప్రకారం బాల్య వివాహాలు జరిగితే శిక్షఅర్హులు అవుతారు. లైంగిక నేరాలనుండి చిన్నారులకు రక్షణకల్పించే చట్టం ఫోక్సో 2012 ప్రకారం 18 సంవత్సరాలు నిండని బాలికలపై లైంగిక వేధింపులు లైంగిక దాడులు నిషేధం చడమైంది. ఈ కార్యక్రమంలో ఎస్సై, సిహెచ్ హరిప్రసాద్ రెడ్డి, బి శ్రీనివాసులు ఎఎస్సై తదితరులు పాల్గొన్నారు.



బుక్స్ రిలీజ్ చేస్తున్న పెబ్బేరు ఎస్సై

## పట్టణ మహిళా గ్రూపులకు మార్గనిర్దేశకాలు

### మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్

**కల్వకుర్తి, ఫిబ్రవరి21 ప్రభాతవార్త:** కల్వకుర్తి మున్సిపాలిటి కార్యాలయంలో శుక్రవారం పట్టణ మహిళా సంఘాల రిసోర్స్ పర్సన్‌లకు సమావేశము ఏర్పాటుచేసి వారు చేయాల్సిన విధులపై మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్ తగు సూచనలు సలహాలు చేశారు. కల్వకుర్తి పట్టణ పరిధిలో కొత్తగా మహిళా గ్రూపులను ఏర్పాటు చేయాలని, అదేవిధంగా మహిళా గ్రూపులకు బ్యాంకుల ద్వారా తీసుకునే లోన్లను వెంటనే మంజూరయ్యే విధంగా చూడాలని, శ్రీనిధి లోన్లకు అర్హత కలిగిన వారికి వెంటనే లోన్లు వచ్చే విధంగా చేయాలని మరియు తడి చెత్త, పొడి చెత్తలను వేరుచేసి ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ ఆటోలకు అందివ్వాలని పట్టణ ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. రిసోర్స్ పర్సన్‌లు ఎవరైనా వారి విధులలో అలసత్వం ప్రదర్శిస్తే, విధులు సక్రమంగా నిర్వహించకపోతే వారిపై కఠినంగా చర్యలు తీసుకొనబడునని హెచ్చరించారు. ఇట్టి సమావేశంలో మెప్మా సిబ్బంది, రిసోర్స్ పర్సన్స్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ తదితరులు పాల్గొన్నారు.



మహిళా గ్రూపు రిసోర్స్ పర్సన్స్‌లకు మార్గనిర్దేశకాలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్

## పాఠశాల విద్యార్థులకు సైకిళ్ళు పంపిణీ చేసిన ఎస్సై

**అయిజ, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఉప్పల గ్రామంలో నీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినిలకు సిందనూరు గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త మూలగుండం శివరామకృష్ణ సహకారంతో శుక్రవారం స్థానిక ఎస్సై శ్రీనివాసరావు సైకిళ్ళు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పల క్యాంపు నుండి ఉప్పల గ్రామానికి రోజు స్కూల్ కి నడుచుకుంటూ వెళుతున్న విద్యార్థినులను చూసి మానవతా దృక్పథంతో మూలగుండం శివరామకృష్ణ 16 మందికి సైకిల్ పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరె న్నో చేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండలం ఎంఈఓ రాములు, ఉప్పల్ జిహెచ్ఎంసి హెడ్మాస్టర్ బలరాం, సిందనూరు మాజీ సర్పంచ్ నరసింహులు, సత్య రెడ్డి, సోమశేఖర్ రెడ్డి ,భీమన్న ,అంజన్న ,వెంకటేశు బాబు, ఏక్లాస్ పురం మాజీ సర్పంచ్ ఆంజనేయులు, గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ భాస్కర్ గౌడ్, లక్ష్మన్న, తిమ్మారెడ్డి ,మాజీ ఎంపి టిసి కర్రన్న, మాజీ ఎంపిటిసి కృపానందం, లాల్ గౌడు ,మహేష్ ,నరసిములు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.




విద్యార్థులకు సైకిళ్ళు పంపిణీ

## ప్రభుత్వ పాఠశాలకు గ్యాస్ సిలిండర్ వితరణ

**మక్తల్ టౌన్ ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** పాఠశాల హెచ్ఎం గ్యాస్ సిలిండర్ స్టవ్ బడికి డొనేట్ చేశారు. ఎంపీ యుపిఎస్ రుద్రసముద్రం పాఠశాల హెడ్మాస్టర్ హేమలత అంకుర్ యస్ఏ సాంఘిక శాస్త్రము తన పాఠశాలకు మధ్యాహ్న భోజనం కార్మికుల కోరిక మేరకు వంట గ్యాస్ సిలిండర్ స్టవ్ ఉచితంగా అందించడం జరిగినది. వంట కార్మికుల సౌకర్యార్థం విద్యార్థుల సౌకర్యార్థం హెడ్మాస్టర్ సుమారుగా 10,000 ఖర్చుతో కూడిన సిలిండర్ స్టవ్ ఇవ్వటం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో రుద్రసముద్రం పాఠశాల ఉపాధ్యాయులు, హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు,కుమార్ ప్రహ్లాద ఆంజనేయులు, మంజులత, వరుణ్ కుమార్, ప్రమీల, దివ్య, జ్యోతి మధ్యాహ్న భోజన కార్మికులు రహన బేగం, అంజమ్మ, స్కావెంజర్స్ నర్సింలు సావిత్రి మొదలగు వారు పాల్గొనడం జరిగింది. మధ్యాహ్న భోజన కార్మికులు తమ పాఠశాల హెడ్మాస్టర్‌కు ధన్యవాదములు తెలియజేయడం జరిగినది తమ యొక్క బాధలను గమనించి అడిగిన వెంబడే కాదనకుండా తమకు సిలిండర్ గ్యాస్, స్టౌ దానికి సంబంధించిన అన్ని సామాగ్రిని ఉచితంగా అందించడం వల్ల తమకు చాలా ఆనందంగా ఉంది అని తెలిపారు.



గ్యాస్ సిలిండర్ వితరణ చేస్తున్న దృశ్యం

## శ్రీ కురుమూర్తి స్వామి సన్నిధిలో సంస్థానాధిశులు

**చిన్న చింతకుంట, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీ కురుమూర్తి స్వామిని ముక్కెర రాజవంశీయులు శ్రీ రాజా రాం భూపాల్‌తో పాటు కూతురు సాయి కృతిక అల్లుడు వెంకటరెడ్డిలు దర్శించుకున్నారు. అంతకు ముందు శ్రీ కురుమూర్తి స్వామి కొండకు చేరుకోగానే ముక్కెర రాజవంశీలను దేవస్థాన చైర్మన్ గోవర్ధన్ రెడ్డి స్వాగతం పలికారు. ప్రధాన ఆలయంలో స్వామివారికి అష్టోత్తర అర్చన పూజలు నిర్వహించారు. వేద పండితులు వేద ఆశీర్వచనాలు అందించి ఘనంగా సన్మానించారు. ఆలయ అర్చకులు వెంకటయ్య, సత్యనారాయణ, అనంత విజయ్, పాలకమండలి సభ్యులు భాస్కరాచారి, కమలాకర్, దేవస్థాన సిబ్బంది ఉన్నారు.



స్వామి సన్నిధిలో సంస్థానాధీశులు

## రబీ సీజన్, రానున్న వేసవిలో నాణ్యమైన నిరంతర విద్యుత్ అందించాలి

**గద్వాల, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** ప్రస్తుత రబీ సీజన్, రానున్న వేసవిలో జిల్లాలో నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు అన్ని అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ విద్యుత్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జూరాల జనరేషన్ ప్లాంట్, 220/132 కేవీ జూరాల సబ్ స్టేషన్, 132/33 కేవీ ,33/11 కేవీ గద్వాల్ సబ్ స్టేషన్, మానిటరింగ్ సెల్ లను ఆకస్మికంగా తనిఖీ చేసి, అక్కడి పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యుత్ సరఫరా ఎక్కడి నుండి వస్తుంది, ఎంత మేరకు సరఫరా అవుతోంది, సరఫరాలో అంతరాయం ఏర్పడితే ఏ ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటారు, ఎంత మంది సిబ్బంది విధుల్లో ఉంటారు. అనే అంశాలను విద్యుత్ శాఖ ఇంజినీర్ ను అడిగి తెలుసుకున్నారు. తదనంతరం విద్యుత్ సరఫరా, నిర్వహణ, డిమాండ్ సరఫరా అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించి, ప్రస్తుత రబీ సీజన్, రానున్న వేసవిలో వ్యవసాయం, గృహాలు, ఆసుపత్రులు, పరిశ్రమలకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు అన్ని అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని, డిమాండ్ కు అనుగుణంగా విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ప్రజలకు నిరంతర విద్యుత్ అందించడంలో ఏమైనా సమస్యలు ఎదురైతే, సంబంధిత అధికారులు తక్షణమే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గద్వాల్ జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ తిరుపతి రావు, అసిస్టెంట్ డివిజన్ ఇంజినీర్లు రమేష్ బాబు, గోవిందు, నవీన్ బాబు, ట్రాన్స్ కో జెన్కో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





విద్యుత్ ఉపకేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ సంతోష్

## మహా మేధావులంతా అంగన్వాడీ, బాల వికాస కేంద్రాల వారే

**- ఐసీడీఎస్ జిల్లా అధికారిణి జరీనా బేగం - పోతులమడుగులో ఘనంగా భగీరథ బాలలవికాస కేంద్రం 16వ వార్షికోత్సవం**

**భూత్పూర్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** బాలల విద్యావికాసం అంగన్వాడీ, బాలల వికాస కేంద్రాలనుంచే ఆరంభమౌతుందని ఐసీడీఎస్ జిల్లా అధికారిణి జరీనాబేగం స్పష్టం చేశారు. శుక్రవారం భూత్పూర్ మండలం పోతులమడుగులో ప్రభుత్వ, హెచ్‌బీఎల్ సౌజన్యంతో నడుస్తున్న భగీరథ బాలల వికాస కేంద్రం 16వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. వార్షికోత్సవానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రభాకర్, మండల విద్యాధికారిణి ఉషారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వజీమా సుల్తానాతో పాటు హెచ్‌బీఎల్ అసోసియేట్ విజయలిక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా అధికారిణి జరీనా బేగం మాట్లాడుతూ శిశు వికాసం పట్ల ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుం దని చెప్పారు. ఎంపీడీఓ ప్రభాకర్ మాట్లాడుతూ హెచ్‌బీఎల్ భూత్పూర్ మండలంలో మనిర్ని గ్రామాల్ని దత్తత తీసుకుని బాలల వికాస కేంద్రాలనేర్పాటు చేయాలని కోరారు. ఎంఈఓ ఉషారాణి మాట్లాడుతూ బాలల వికాసానికి హెచ్‌బీఎల్ సంస్థ తన వంతు సహకారమంది స్తోందని పేర్కొన్నారు. హెచ్‌బీఎల్ తన సేవల్ని మరింత విస్తరించాల్సిన అవసరముందన్నారు. హెచ్‌బీఎల్ అసోసియేట్ విజయలక్ష్మి మాట్లాడుతూ బాలల వ్యక్తిత్వ వికాసానికి తోడ్పాటునిస్తోందని చెప్పారు. తెలుగు రాష్ట్రాలలో దాదాపుగా మూడు వేల మంది చిన్నారుల్ని దత్తత తీసుకుని అంగన్వాడీ కేంద్రాల ద్వారా వారికి పోషకాలను అందిస్తోందన్నారు. మాజీ ఎంపీటీసీ ఊషయ్య, మాజీ సర్పంచ్ చికిష్టయ్య, హెచ్‌బీఎల్ జీఎం ఇతర ఉద్యోగులు యాదగిరిరెడ్డి, బాలీశ్వరి, యామిని, అంగన్వాడీ కార్యకర్తలు, వర్కర్లు పాల్గొన్నారు. వార్షికోత్సవం సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన డాన్స్, నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. చక్కగా అభినయించిన చిన్నారులను అధికారులు అభినందించారు.




వార్షికోత్సవలో నృత్యాలు చేస్తున్న చిన్నారులు

## మాజీ సింగిల్ విండో డైరెక్టర్ గుండెపోటుతో మృతి

**పార్థివదేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి**



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే సతీమణి జ్యోతి

**గద్వాల, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** గద్వాల నియోజకవర్గంలోని ధరూర్ మండలం కేంద్రానికి చెందిన మాజీ సింగిల్ విండో డైరెక్టర్ ధరూర్ బుడ్డ చంద్రశేఖర్ రెడ్డి గుండెపోటు తో శుక్రవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న శుక్రవారం ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి వారి ఇంటికి వెళ్లి ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే సతీమణి వెంట మాజీ జెడ్పిటిసి పద్మ ,వెంకటేశ్వర్ రెడ్డి, జములమ్మ ఆలయ డైరెక్టర్ రాధమ్మ, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, మహబూబ్, నవీన్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు మల్దకల్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం

**మల్దకల్, ఫిబ్రవరి21 ప్రభాతవార్త:** మల్దకల్ మండల కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ ఆవరణలో నేడు గద్వాలకు చెందిన శుభకర హాస్పిటల్స్ వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు జరిగే కంటి వైద్య శిబిరంలో కంటి వైద్య నిపుణులు డాక్టర్ ఎం. లావణ్య ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

## జెడ్పి సీఈఓ ఏ యాదయ్యకు జిల్లాఅదనపు కలెక్టర్‌గా భాధ్యతలు

**వనపర్తి టౌన్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా అదనపుకలెక్టర్ (స్థానిక సంస్థలు) గా జెడ్పి సీఈఓ ఏ యాదయ్య పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ ) స్వీకరించారు. జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ నారాయణపేట జిల్లాకు బదిలీ అయిన నేపథ్యంలో జెడ్పి సీఈఓ యాదయ్యకు వనపర్తిజిల్లా స్థానికసంస్థల అదనపుకలెక్టర్‌గా బాధ్యతలు అప్పగిస్తూ శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఉత్తర్వులు జారీ చేశారు. అదనపు కలెక్టర్‌గా యాదయ్య బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.



## అమ్మాయిలకు అవకాశాలు కల్పించి వారి ఎదుగుదలకు ప్రోత్సహిద్దాం

**పెబ్బేరు, ఫిబ్రవరి21 ప్రభాతవార్త:** అమ్మాయిలు విత్తనాల వంటి వారనీ ప్రేమతో, అవకాశాలతో పెంచితే అందరికీ నీడను అందించే శక్తివంతమైన వృక్షాలుగా పెరుగుతారనీ వారి ఎదుగుదలను ప్రోత్సహిద్దామని ఇన్చార్జి సిడిపిఓ బాలేశ్వరి పిలుపునిచ్చారు. వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలో శుక్రవారం మహిళా శిశు సంక్షేమ శాఖలోని జిల్లా మహిళా సాధికారత కేంద్రం వారు బేటి బచావో బేటి పడావో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కస్తూరిభా గాంధీ పాఠశాల, బునియాదిపూర్ మండల పరిషత్ పాఠశాల, వెలుగొండ మండల పరిషత్ పాఠశాలలో చెట్లు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో అమ్మాయిలు విత్తనాలు వంటి వారనీ ప్రేమతో, అవకాశాలతో పెంచితే అందరికీ నీడను అందించే శక్తి వంతమైన వృక్షాలుగా పెరుగుతారనీ వారి ఎదుగుదలను ప్రోత్సహిద్దామని ఇన్చార్జి సిడిపిఓ బాలేశ్వరి పిలుపునిచ్చారు. పెబ్బేరు ఎస్సై మాట్లాడుతూ ఆడపిల్లలు మన కుటుంబానికి, సమాజానికి గుండె చప్పుడు అని వారి అభివృద్ధి చెందడానికి అవసరమైన అవకాశాలు మద్దతును ఇవ్వాలని అన్నారు. జిల్లా మహిళా సాధికారిక కేంద్రం నుండి డిస్టిక్ మిషన్ కో ఆర్డినేటర్ భాస్కర్ మాట్లాడుతూ ప్రతి ఆడపిల్ల కళ్ళలోనూ ప్రకాశమంతమైన రేపటి ఆశ ఉంటుందన్నారు. భవిష్యత్తును మార్చేవారిగా, నాయకురాలిగా ఉండేలా వారిని శక్తివంతం చేద్దాం అని పిలుపునిచ్చారు. సూపర్వైజర్ వినోద, డిస్టిక్ మిషన్ కోఆర్డినేటర్ భాస్కర్, అటవీ సెక్షన్ ఆఫీసర్ రాణి, ఎస్ ఓ పద్మ, జెండర్ స్పెషలిస్టులు శ్రీవాణి, సలోమి విద్యార్థులు పాల్గొన్నారు.



పాఠశాలలో చెట్లు నాటుతున్న మహిళ సంక్షేమ శాఖ అధికారులు

## ఈద్గా వద్ద సమాధులను తవ్విన వారిపై చర్యలు తీసుకోవాలి

**ఆత్మకూరు, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణ సమీపంలోని కర్షక రైస్ మిల్ వద్ద గల ఈద్గా వద్ద అక్రమంగా తవ్వకాలకు పాల్పడిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆత్మకూరు పట్టణానికి చెందిన ఖాజా పాషా, సిరాజ్ తదితరులు ఆత్మకూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం ఆత్మకూరులో విలేకరులతో మాట్లాడుతూ కర్షక రైస్ మిల్ సమీపంలోని ఈద్గా వద్ద ముస్లింలకు చెందిన పలువురు సమాధులను నిర్మించగా అక్కడ ఆత్మకూరుకు చెందిన మగ్బుల్ బిన్ సయ్యద్, ఎగ్బాల్ బిన్ సయ్యద్ తదితరులు మోట్లంపల్లి గ్రామానికి చెందిన జెసిబి డ్రైవర్ వెంకటేష్ తో కలిసి అక్రమంగా కాలువ తవడమే కాకుండా సమాధులను తవ్వి మనోభావాలు దెబ్బ తీసే విధంగా వివరించారని ఈ విషయంపై ఆత్మకూరు పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని వారు తీవ్రస్థాయిలో ఆరోపించారు. ఈ నెల 14వ తేదీన అక్రమంగా కాలువ తవ్వుతూ సమాధులను పెకిలించిన విషయాన్ని గత సోమవారం ప్రజావాణిలో భాగంగా జిల్లా ఎస్పీకి సైతం లికిత పూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ చట్టపరమైన చర్యలు తీసుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి సమాధులను పెకిలించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని లేని పక్షంలో తాము కబ్రిస్తాం కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలకు కొనుక్కుంటామని వారు పేర్కొన్నారు.



చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసిన దృశ్యం

## మండల నూతన తహసీల్దార్‌గా పదవి బాధ్యత స్వీకరణ

**అడ్డాకుల ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** అడ్డాకుల మండల తహశీల్దార్‌గా శుక్రవారం నుంచి కె.శేఖర్ బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు, ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల రైతులకు భూ సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకొచ్చి శాంతియుతంగా పరిష్కరించు కోవాలని తెలిపారు, మండలంలో అక్రమ ఇసుక, మట్టి, పర్మిషన్ లేకుండా ఇలాంటి ఇల్లీగల్‌గా ఏమైనాజరిగితే మాదృష్టికి తీసుకురావాలని తెలిపారు. తప్పుచేసినవారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



## ఎమ్మెల్యే సహకారంతో మంజూరైన స్ప్రింక్లర్ల అందజేత

**వెల్దండ, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** వెల్దండ మండలం రాచూరు గ్రామానికి చెందిన ముగ్గురు రైతులు ఎలిగాస్. కృష్ణయ్య, దుబ్బ లక్ష్మయ్య, గుల్ల జంగయ్యలకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో సబ్సిడీతో మంజూరైన స్ప్రింక్లర్లను శుక్రవారం రైతులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు పడకంటి వెంకటేష్, చంద్రశేఖర్‌తో పాటు డీలర్ శ్రీధర్‌రెడ్డిలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతన్న సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని విధాల సహకారం అందిస్తున్నారన్నారు.



రైతులకు స్ప్రింక్లర్లు అందజేస్తున్న దృశ్యం

## వెల్దండ ప్రభుత్వ కళాశాల వీడ్కోలు పార్టీలో విద్యార్థుల ఘర్షణ

**- మద్యం మత్తులో బీర్ సీసాలతో దాడి చేసుకున్న వైనం**

**వెల్దండ, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** దేవాలయంతో సమానమైన కళాశాలలో విద్యార్థులు గురువులు చెప్పిన పాఠాలు వింటూ విద్యాబుద్ధులు నేర్చుకోవాల్సిన విద్యార్థులు నేడు చేడు వ్యసనాలకు అలవాటు పడి కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో విద్యార్థులు మద్యం మత్తులో కళాశాల ఆవరణంలోనే బీరు సీసాలతో కొసుకున్న సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. వెల్దండ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రతి సంవత్సరం మాదిరిగానే కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రథమ సంవత్సరం విద్యార్థులు వీడ్కోలు పార్టీ ఏర్పాటు చేశారు. ఒకవైపు వీడ్కోలు సమావేశంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తుండగానే మరోవైపు కళాశాల ఆవరణలో కొంతమంది విద్యార్థులు మద్యం మత్తులో మాటా మాటా పెరిగి చివరికి బీరు సీసాలు ధ్వంసం చేసి పొడుచుకునే స్థాయికి చేరింది. తోటి విద్యార్థులు వారిని సముదాయించి ఘర్షణలో గాయపడిన వెల్దండ మండల గ్రామానికి చెందిన ఓ విద్యార్థి చేతికి గాయం కాగా వెల్దండ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందించారు. గతంలో ఎన్నడు లేని విధంగా కళాశాలలో విద్యార్థుల ప్రవర్తన తీరులో చాలా మార్పులు వచ్చాయని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా కళాశాలలో పర్యవేక్షణ లోపం కారణంగానే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కళాశాలలో జరిగిన ఘర్షణపై కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్‌రావును వివరణ కోరగా విద్యార్థులు గొడవ పడినట్లు మా దృష్టికి రాలేదని విద్యార్థులను అడిగి తెలుసుకుంటానని తెలిపారు. సమాచారం తెలుసుకున్న వెల్దండ పోలీసులు కళాశాలకు వెళ్లి విద్యార్థులకు కూడా ఆరా తీశారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రిన్సిపల్, అధ్యాపక బృందం చూసుకోవాలని విద్యార్థులు సైతం క్రమశిక్షణతో మెలగాలని సూచించారు.



ప్రభుత్వాసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న విద్యార్థి

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** మండలంలోని తాడూరు గ్రామ శివారులో మోటర్ సైకిల్ (బైకు) అదుపుతప్పి మహాత్మ గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం సబ్ కెనాల్‌లో పడి యువకుడు మృతి చెందాడు. సంఘటనకు సంబంధించి స్థానికుల వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి. కల్వకుర్తి మండలం రఘుపతిపేట గ్రామానికి చెందిన వినోద్‌గౌడు బైకుపై అచ్చంపేట మండలం చెన్నారం నుంచి తాడూరు గ్రామం వైపు వస్తుండగా ఇటీవల మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద పులిజాల నుంచి వెళ్తున్న కాలువలో పడి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు ఎప్పుడు పడ్డ సంగతి తెలియదు కానీ శుక్రవారం వేకువజామున వ్యవసాయ పొలాలకు వచ్చే రైతులు సంఘటనను చూసి వెంటనే పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిసింది. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని మృతదేహాన్ని అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు తెలిసింది. మిగతా విషయాలు తెలియాల్సి ఉంది.



తాడూరు సమీపంలో కాలువలో పడి మృతి చెందిన వినోద్ గౌడు

## రంజాన్ మాసంలో ప్రభుత్వపరంగా ఏర్పాట్లు చేయాలి

**- జిల్లా కలెక్టర్‌కు కాంగ్రెస్ ముస్లిం మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో వినతి**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** ముస్లింల పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ పరంగా ఏర్పాట్లు చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు హబీబ్ ఉర్ రెహమాన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయ అధికారికి శుక్రవారం వినతిపత్రం అందించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని 4 మున్సిపాలిటీలు, 20 మండలాలలోని మస్జిద్‌లు, ఈద్గాల వద్ద పారిశుద్ధ్య పనులతో పాటు నీటి వసతి, విద్యుత్, పెయింటింగ్ ఇతర మరమ్మత్తుల కోసం చర్యలు తీసుకోవాలని ఆ వినతి పత్రంలో కోరారు. నీటి వసతి, శానిటేషన్ పనులు చేపట్టాలని, మస్జిద్లు, ఈద్గాలు, కబ్రస్తాన్‌ల వద్ద పారిశుద్ధ్య పనులతో పాటు పెయింటింగ్ తదితర పనులు చేపట్టాలని కోరారు. అదేవిధంగా షబ్ ఏ ఖదర్ సందర్భంగా ఆరోజు ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని, ఆ రోజుతో పాటు రంజాన్ మాసంలో విద్యుత్‌కు అంతరాయం లేకుండా చూడాలని, ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జారీ చేసిన విధంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో కూడా రాత్రి వేళల్లో హోటళ్ళు ఇతర వ్యాపారాలను కొనసాగించే విధంగా అనుమతులు ఇవ్వాలని కోరారు. మున్సిపాలిటీలలోని వార్డులలో ముస్లిం జనాభా ఉన్న వీధులలో పారిశుధ్యం, ఇతర ఏర్పాట్లను చేపట్టాలని కోరారు. ఈ విధంగా ఇతర పట్టణాలు మండల కేంద్రాలు గ్రామాలలో సైతం రంజాన్ సందర్భంగా ఏర్పాటు చేయాలని కోరారు. నీటి సరఫరాకు ఇబ్బందులు ఉన్నచోట ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలని ఆ వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ జిల్లా అధ్యక్షులు హబీబ్ ఉర్ రహ్మాన్, ఉపాధ్యక్షులు ఖలీల్, కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకులు మహమ్మద్ గౌస్, మహమ్మద్ హబీబ్ ఖాన్, నాగర్ కర్నూల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నజీర్, మైనార్టీ నాయకులు ఖాదర్, ఇంతియాజ్, మహమ్మద్ జాకీర్ ఖాన్, ఖాజా బాబా, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ కార్యాలయ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

## మాతృభాషను గౌరవించుకుందాం

**బిజినేపల్లి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** మనిషి తాను ప్రపంచంలో అన్ని చోట్ల జయించాలంటే తన మాతృభాషను గౌరవించాలి అని నవోదయ ప్రిన్సిపల్ పి. భాస్కర్ కుమార్ అన్నారు. వట్టెం జవహర్ నవోదయ విద్యాలయాలు శుక్రవారం నాడు అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకొని వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలుగు భాష విభాగాధిపతి



నవోదయలో భాష దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ మాతృభాషా దినోత్సవ వేడుకలను ప్రిన్సిపాల్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రిన్సిపల్ భాస్కర్ కుమార్ మాట్లాడుతూ మనస్సులోని భావాలను సహజంగా వ్యక్తం చేయగల శక్తి మాతృభాషలో ఉందన్నారు. మన మాతృభాష అయినటువంటి తెలుగును ఎప్పటికీ మరువకూడదని దేశంలో ప్రపంచంలో ఎన్ని భాషలు ఉన్నా, ప్రతి ఒక్కరికి వారి మాతృభాషను మించినటువంటి భాష ఉండదని మాతృభాషను ఎప్పటికీ మర్చిపోకుండా దాని పరిరక్షణకు కృషి చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. రాజేంద్రప్రసాద్ ప్రసంగిస్తూ మనిషి తన మనసులోని అభిప్రాయాలు, భావాలను బహిర్గతం చేయడానికి ముఖావయంతో చేసే అర్థవంతమైన ధ్వనుల సముదాయమే భాష అన్నారు. ప్రపంచంలో ప్రతి ఒక్కరికి వారి వారి మాతృభాష చాలా ముఖ్యమైనదని ఆ మాతృభాషను రక్షించుకోవడం కోసం పరిరక్షించుకోవడం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో నవోదయ అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

## శివ స్వాములకు పండ్లు అల్పాహారం పంపిణీ

**బిజినేపల్లి ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** శివరాత్రి వేడుక సందర్భంగా శ్రీశైలం మహా క్షేత్రానికి పాదయాత్రగా వెళుతున్న శివ స్వాములకు పాలెం గ్రామంలో పండ్లు అల్పాహారం పంపిణీ చేశారు. తోటపల్లి సుబ్బయ్య విగ్రహానికి నివాళులర్పించి అనంతరం ఆయన జ్ఞాపకార్థం శుక్రవారం స్వాములకు పండ్లను పంపిణీ చేశారు. గార్లపాటి నాగన్ గౌడ్ చంద్రావతి ,అజయ్



శివ స్వాములకు పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

స్రవంతి దంపతులు పండ్లను పంపిణీ చేశారు. తేజ వాటర్ ప్లాంట్ విష్ణు మినరల్ నీళ్లు అందించారు . ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ చేశారు. పాలెం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ సన్నిధిలోగౌతపురం శ్రీ విజయ లక్ష్మీనరసింహస్వామి ఆలయ పీఠాధిపతి జగద్గురు శ్రీశ్రీ హరి బాలానంద దాసు ఆధ్వర్యంలో కొండాపూర్ మాజీ ఉపసర్పంచ్ అజిలాపూర్ చెన్నయ్య, సభ్యులు కే.శ్రీను తెలిపారు. ఈ కార్యక్రమంలో నవాబ్ పెట్ మండల వాసులు శ్రీను,శేఖర్ ,కుమార్, అజర్, సత్యం,బాలయ్య, లక్ష్మయ్య,రఘువీర్, స్వామివారి సేవకులు బండారుజగదీష్ శివ కొండమ్మ పాల్గొన్నారు.మంగనూరు గ్రామానికి చెందిన చైతన్య యువజన సంఘం రెండు రోజులుగా ఉదయంఅల్పాహారం, మధ్యహ్నం అన్న ప్రసాదం, సాయంత్రం పండ్ల పంపిణీ చేస్తున్నట్లు చైతన్య యోజన కమిటీ సభ్యులు పిట్టల భీమయ్య బాలరాజ్, తిరుమల్ ,అశోక్ హాజీ, కృష్ణా, నరేష్, రవి, యాదయ్య తెలిపారు.

## మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ పై చర్య తీసుకోవాలి

**వనపర్తి క్రైమ్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** మెడికల్ కాలేజీలో ఔట్సోర్సింగ్ మహిళా కార్మికుల పట్ల ప్రిన్సిపల్ అనుచిత వైఖరి పై ఉన్నతాధికారు లు చర్య తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ స భ్యులు కే శ్రీరామ్, సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశా రు. ఎండ వేడికి స్పృహ తప్పి పడిపోయిన మహి ళా కార్మికురాలు పి.సు జాతను వనపర్తి ప్రభు త్వ ఆసుపత్రిలో పరామర్శించి మాట్లాడారు. శుక్రవారం వనపర్తి ప్రభుత్వం మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న ఐదుగురు ఔట్సోర్సింగ్ మహిళా కార్మికులు పనిచేయడం లేదని నింద వేసి ప్రిన్సిపల్ విధులకు రానీయలేదన్నారు. అబండాలు సరికాదని విధులలోకి వస్తామని ప్రాధేయపడిన కనికరించలేదన్నారు. కనికరించి పిలుస్తారేమోనని ఆసుపత్రి గేటు వద్ద ఎండలో వేచి చూసారన్నారు. పి.సుజాత అనే మహిళా కార్మికురాలు ఎండ తీవ్రతకు స్పృహ తప్పి పడిపోగా అంబులెన్స్‌లో వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారన్నారు. తమపై నిందలను జీర్ణించుకోలేక కన్నీరు మున్నీరుగా సుజాత విలపిస్తోందన్నారు. తక్షణం ఐదుగురిని విధుల్లోకి తీసుకోవాలని, ప్రిన్సిపల్ వేధింపుపై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కళాశాల వద్ద ఏఐటీయూసీ, సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

## ఎల్లప్పకు న్యాయం చేయాలి

**మద్దూర్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా ఉమ్మడి మద్దూరు మండల పరిధిలోని అల్లిపూర్ గ్రామం లో తల్లి జీతం రూ. 9 వేల అడిగినందుకు అదే గ్రామానికి చెందిన రాజ కీయ నాయకుడు తన రాజకీయ పలుకబడితో పోలీసులకు సమాచారం ఇచ్చి కొట్టించడం చాలా దారుణమని కొడంగల్ తాలూకా ముదిరాజ్ సం ఘం నాయకులు నర్సి ములు మాట్లాడుతూ తెలి పారు. నియోజకవర్గంలో బీసీల ఓట్ల వల్లే ఏ పార్టీ నాయకుడైన గెలుపొందడం జరుగుతుందని, కావున మా ఓట్లు వేసుకొని మా పైనే దాడి చేయడం బాధాకరమని హెచ్చరించారు. ఎల్లప్పపై దాడికి కారణమైన రాజకీయ నాయకుడి పై క్రమశిక్షణ రహితంగా ప్రవర్తించిన పోలీస్ శాఖ సిబ్బం దిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని లేనియెడల మండల స్థాయి నుంచి తాలుక స్థాయి వరకు నిరసన కార్యక్రమం చేపడతామని అన్నారు.ఈ కార్యక్రమంలో నారాయణ, తిరుపతయ్య,రవి, శివశంకర,గోపాల్, జనార్ధన్ ,నెల్లి రాములు,తలారి సాయిలు, భీంషన్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన ప్రాక్టికల్ పరీక్షలు

**వనపర్తి క్రైమ్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు జిల్లా వ్యాప్తంగా శుక్రవారం రోజు ముగిశాయి. మొత్తం మూడు స్పెల్ లలో జనరల్ కోర్సులకు 32 సెంటర్లు, ఒకేషనల్ కోర్సులకు 09 సెంటర్లలో పరీక్షలు నిర్వహించడం జరిగింది. మొదటి స్పెల్ లో 95.18 శాతం మంది, రెండవ స్పెల్ లో 96.56 శాతం మంది, మూడవ స్పెల్ లో 96.87 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ సెక్రటరీ కృష్ణ ఆదిత్య, ఈ మూడు స్పెల్ లలో ఆబ్సెంట్ అయిన విద్యార్థులకు మరొకసారి పరీక్ష రాయడానికి అవకాశం కల్పించారు. ఈ పరీక్షలను నాల్గవ స్పెల్ లో నాలుగు రోజులు గా జిల్లాలోని అన్ని కాలేజీలకు కలిపి ప్రభుత్వ జూనియర్ కళాశాల వనపర్తి నందు పరీక్షలు నిర్వహించగా జనరల్ విద్యార్థులు 36 మంది, ఒకేషనల్ విద్యార్థులు 114 మంది మొత్తం 150 మంది విద్యార్థులు వివిధ సబ్జెక్టులకు హాజరయ్యారు. సెక్రటరీ కల్పించిన ఈ అవకాశాన్ని 150 మంది విద్యార్థులు సద్వినియోగం చేసుకున్నారు. ఫిబ్రవరి 3వ తేదీ నుంచి 21 వ తేదీ వరకు నిర్వహించిన ప్రాక్టికల్ పరీక్షలు సెక్రటరీ, బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్, జిల్లా కలెక్టర్ ఆదేశానుసారము ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎర్ర అంజయ్య తెలిపారు.

## జిల్లా ప్రజలను నిరాశపర్చిన ముఖ్యమంత్రి సభ

**నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలో జరిగిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభ ప్రజలను నిరాశపరిచిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్రామిరెడ్డి విమర్శించారు. శుక్రవారం నాడు నారాయణపేట జిల్లా కేంద్రం




మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వెంకట్రామిరెడ్డి

సిపిఎం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జి. వెంకట్రామరెడ్డి మాట్లాడారు. అన్ని విధాలుగా వెనకబాటుకు గురైన నారాయణపేట జిల్లాకు నారాయణపేట,కొడంగల్ ఎత్తిపోతల పథకం ఎంతో ముఖ్యమైందని అన్నారు. అయితే ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులకు 2013 భూ సేకరణ చట్ట పద్ధతిలో న్యాయం చేస్తామని చెప్పకుండా ఎకరంకు పదో 20 లక్షలు ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం దారుణం అన్నారు. ఎన్నో ఏళ్లుగా సాగు చేస్తున్న కంసాన్ పల్లి, మరికల్, లింగంపల్లి కొల్లంపల్లి ,ఎక్లాస్ పూర్ తదితర గ్రామాల రైతులకు పట్టాలు ఇచ్చే విషయం మాట్లాడకపోవడం అన్యాయమని అన్నారు. నారాయణపేట జిల్లాలో కోటకొండ గార్లపాడు ,కాను కుర్తి గ్రామాలను మండల కేంద్రంగా ప్రకటించాలన్న డిమాండ్ పట్టించుకోలేదని ఈ ప్రాంత ప్రజల సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయేందుకు వినతి పత్రం ఇచ్చేందుకు అవకాశం కూడా కల్పించలేదని విమర్శించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా నేతలు గోపాల్, బలరాం కాశప్ప పాల్గొన్నారు.

# పన్నెండు నెలల్లో ఎంతో అభివృద్ధి చేశాం

**మొదటి పేజీ తరువాయి భాగం..**

జిల్లాలో దాదాపు రూ. 967 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేశారు. రూ. 56 కోట్ల వ్యయంతో నిర్మించిన వైద్య కళాశాల భవనానికి ప్రారంభోత్సవం చేశారు. 130 కోట్ల అంచనా వ్యయంతో వైద్య కళాశాల నూతన హాస్టల్ నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా సమీకృత రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ కు శంఖుస్థాపన చేశారు.26 కోట్లతో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవనం, 40 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 100 పడకల యూనిట్ కు శంఖుస్థాపన చేశారు.రూ. 5.58 కోట్ల వ్యయంతో నిర్మించిన ధన్వాడ, నారాయణపేటలో నిర్మించిన రూరల్ పోలీస్ స్టేషన్ భవనాలకు ప్రారంభోత్సవం చేశారు.1.23 కోట్ల వ్యయంతో నిర్మించిన జిల్లా మహిళా సమాఖ్య నిర్వహించే పెట్రోల్ బంక్‌ను ప్రారంభోత్సవం చేశారు. 295 కోట్ల అంచనా వ్యయంతో తుంకిమెట్ల నారాయణపేటరోడ్, కోటకొండ మద్దూరు రోడ్ అభివృద్ధి పనులు, అప్పక్ పల్లి గుండిమాల్ రోడ్, మద్దూరు లింగాల్ చెడ్ రోడ్ లలో హైలెవల్ బ్రిడ్జీల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. 193 కోట్ల నిధులతో గుల్బర్గా కొడంగల్ , రావులపల్లి మద్దూరు, కొస్గి దౌల్తాబాద్ రోడ్డు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేశారు. రూ.12.70 కోట్ల నిధులతో నారాయణపేట నియోజకవర్గ పరిధిలో సిఆర్ఆర్ రోడ్లకు శంఖుస్థాపన చేశారు.7 కోట్లతో మరికల్‌లో నిర్మించిన మండల పరిషత్ కార్యాలయ భవనానికి



మండల పరిషత్ కార్యాలయ భవనానికి శంకుస్థాపన చేస్తున్న సీఎం

ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, పౌర సంబంధాల, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పంచాయతీ రాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి అనసూయ సీతక్క, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డి.జి.పి జితేందర్, ప్రభుత్వ సలహాదారు వేంనరేందర్, జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్, నారాయణపేట శాసన సభ్యులు పర్ణిక రెడ్డి, మహబూబ్ నగర్ శాసన సభ్యులు యెన్నం శ్రీనివాసరెడ్డి రెడ్డి, మక్తల్ శాసన సభ్యులు వాకిటి శ్రీహరి, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### 10వ తరగతి మధ్యలో మానేసిన విద్యార్థులకు

## తిరిగి పరీక్షలు రాయించాలి: జిల్లా కలెక్టర్ సంతోష్

**గద్వాల,ఫిబ్రవరి21 ప్రభాతవార్త:**10వ తరగతి చదువు మధ్యలో మానేసిన విద్యార్థులను తిరిగి పాఠశాలకు చేర్పించి, ఉత్తమ ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. యం అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీ సమావేశ హాల్ నందు పోష్ యాక్ట్ 2013 పై జిల్లా స్థాయి అవగాహన సదస్సు, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పిల్లల హక్కుల పరిరక్షణ కోసం అన్ని శాఖలు సమిష్టిగా పని



పోస్టర్‌ను ఆవిష్కరణ చేస్తున్న జిల్లా కలెక్టర్ సంతోష్

చేయాలని, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఓపరేషన్ స్మైల్" విజయవంతంగా కొనసాగుతుందని, దీని అమలును మరింత మెరుగుపరిచేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు. బాల కార్మికుల రక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో, విద్యార్థుల తరగతి హాజరు తప్పనిసరి అని, ఈ చివరి నెలలో గైర్హాజరు కాకుండా చూడాలని, విద్యార్థులు చదువును మధ్యలో నిలిపివేయకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మధ్యలో చదువు మానేసిన విద్యార్థులను తిరిగి పాఠశాలలో చేర్పించి, పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధించేలా డీసీపీఓ ఫీల్డ్ విజిట్ నిర్వహించి తరగతి హాజరు పెంచాలని సూచించారు. ప్రత్యేక అధికారులు పాఠశాలలను సందర్శించి, విద్యార్థులతో ప్రత్యక్షంగా సమావేశమై, పదవ తరగతి పరీక్షల ప్రాముఖ్యత, విద్య విలువను వివరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. 18 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం చట్టవిరుద్ధమని, అలా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళలపై లైంగిక వేధింపుల నివారణ, నిషేధం, పరిష్కారం చట్టం 2013 అనేది ఉద్యోగ ప్రదేశాల్లో మహిళల భద్రత కోసం తీసుకురాబడిన చట్టమని వివరించారు. ప్రతి కార్యాలయంలో ఇంటర్నల్ కమిటీ ఏర్పాటు చేయాలని, లేకపోతే 50,000 జరిమానా విధించబడుతుందని తెలిపారు. అనువల్ రిపోర్ట్ సమర్పణ, ఉద్యోగస్తులకు తగిన శిక్షణ అందించడం, లైంగిక వేధింపుల వ్యతిరేక విధానాన్ని రూపొందించడం వంటి చర్యలు తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. తదంతరం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మి నారాయణ, నర్సింగరావు, డిఎస్పి మొగలయ్య, డి డబ్ల్యు ఓ అధికారి సునంద, డిఎంహెచ్ఓ సిద్ధప్ప, ఆర్ డి ఓ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### నేటి నుంచి శ్రీశ్రీశ్రీ అన్నపూర్ణ సమేత

## కాశీ విశ్వనాథ స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** మహబూబ్ నగర్ పట్టణంలోని న్యూ మోతినగర్‌లోని శ్రీశ్రీశ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వనాథ స్వామి ఆలయం ప్రథమ వార్షికోత్సవ వేడుకలను ఆలయ కమిటి సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. మొదటి రోజు అనగా నేడు (శనివారం) నుండి ఈ కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. మొదటి రోజు కార్యక్రమాల్లో భాగంగా ఉదయం 9 గం.లకు గణపతి పూజ, పుణ్య హవాచన నవగ్రహ సర్వోత్తోభద్ర మండల దేవత హోమాలు, జలాధివాసం, నీరాజనం, మంత్రపుష్ప రాజోపచేరాలు కార్యక్రమాలు నిర్వహించబడును. సాయంత్రం 4 గంలకు కాలభైరవ విగ్రహ ఊరేగింపు 6 గం.లకు ప్రదోషకాల పూజ, దాన్యాధివాస, ఫిర్యాదివాసములు రాజోపచారాలు కార్యక్రమం నిర్వహించబడుతుందని ఆలయ కమిటీ ధర్మకర్త, చైర్మన్ ఎన్. ప్రభాకర్ తెలియజేశారు. వార్షికోత్సవ వేడుకలలో వార్డు సభ్యులు, మహిళలు,యువకులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ ధర్మకర్త, చైర్మన్ ఎన్. ప్రభాకర్ కోరారు. కార్యక్రమంలో ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు, రాములు యాదవ్, రుక్మిణి, అనురాధ, రాణి, తులసి, జ్యోతి, పుష్పలత, ఆండాలు, లక్ష్మి, జానకి, విజయలక్ష్మి మహేశ్వరి, శోభ, పిట్టల అరుణ, నీలమ్మ,జ్యోత్స్న, అఖిల మొదలైన వారు పాల్గొన్నారు.



వార్షికోత్సవ ఏర్పాట్లలో పాల్గొన్న మహిళలు, కమిటి సభ్యులు

## ఏడాది దాటిన పూర్తికాని బీటీ రోడ్డు పనులు ..

**నవాబుపేట,ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** ఏడాది గడుస్తున్న బిటి రోడ్డు పనులు పూర్తి కావడంలేదని మండల పరిధిలోని ప్రజలు వాపోతున్నారు. నవాబుపేట నుండి లింగంపల్లి వయా వీరన్నపల్లి వరకు ఎఫ్డిఆర్ నిధులు రూ. 47.40 లక్షలతో బీటీ రోడ్డు పనులు అసంపూర్తిగా మిగిలాయి. నవాబ్‌పేట మండల పరిధిలోని గ్రామాల నుండి బాలానగర్‌కు వందల సంఖ్యలో వాహనాలు ప్రయాణం జరుగుతుంటాయి. ఏడాది దాటిన పనులు పూర్తికాక పోవడంతో మండల పరిధిలోని పది నుండి 15 గ్రామ పంచాయతీల ప్రజలు రాకపోకలకు ఇబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాంట్రాక్ట్ సంస్థ సాయి రిత్విక్ కన్స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ సంస్థ ఈ ప్రాజెక్టును పూర్తి చేయాల్సి ఉండగా సంవత్సరం గడుస్తున్నా ఇంకా పూర్తి చేయలేదు. రోడ్డు నిర్మాణానికి, ఎమ్మెల్యే పనులు ప్రారంభించినా గుత్తేదారు నిర్లక్ష్యంతో పనులు నిలిచి పోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక గ్రామాలలోని రోడ్లకు మహర్దశ వచ్చిందని ప్రజలు సంతోషంలో ఉన్నారు. ఎమ్మెల్యే చొరవతో మండల వాసుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని చాలావరకు రోడ్లు మంజూరు చేయించారు. కానీ కాంట్రాక్టర్ల అధికారుల నిర్లక్ష్యంతో సకాలంలో పనులు పూర్తికాక ప్రజలకు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఉన్న రోడ్డు పైన ప్రయాణించడానికి ప్రజలు, చిరు వ్యాపారులు అవస్థలు పడుతున్నారన్నారు. ప్రమాదాలు జరుగుతున్నాయని రోడ్డుపై పాదాచారులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. అధికారులు, కాంట్రాక్టర్ సంస్థ రోడ్డు నిర్మాణం పనుల ఆలస్యానికి కారణమన్నారు. ఆర్అండ్‌బీ డీఈ సమస్యను పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు.




పూర్తికాని బిటి రోడ్డు పనులు

## పేటలో ప్రెస్ క్లబ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి

### జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

**నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికా రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సివిల్ లైన్ మార్గంలో జర్నలిస్ట్ యూనియన్లకు అతీతంగా ఏర్పాటుచేసిన నూతన ప్రెస్ క్లబ్ తాత్కాలిక భవనాన్ని ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు నాగురావ్ నామాజీతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం పాటుపడుతున్న జర్నలిస్టుల సేవలు అభినందనీయమన్నారు. త్వరలోనే జిల్లా కేంద్రంలో శాశ్వత ప్రెస్ క్లబ్ భవన నిర్మాణాన్ని ఏర్పాటు చేసుకుందామని అందుకు తాము కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులను ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మార్కెట్ చైర్మన్ సదాశివరెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు కొండా సత్య యాదవ్, కాంగ్రెస్ నాయకులు మనోహర్ గౌడ్, విశ్రాంత అధ్యాపకులు వెంకటయ్య, టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు విజయ సాగర్, సిపిఎం నాయకులు వెంకట్రామిరెడ్డి, సిపిఐ ఎంఎల్ నాయకులు కాశీనాథ్, సిఐటియు నాయకులు బలరాం, మాజీ కౌన్సిలర్ మహేష్ లతో పాటు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు కోయిలకొండ నారాయణ రెడ్డి, రాజేష్, లొట్టి శ్రీనివాస్, నక్క శ్రీనివాస్, ఆనంద్ గౌడ్, రఘుగణప , పట్వారి శ్రీధర్ రావు, రమాకాంత్, మధు, రాజేష్ ఆకుల, యాదిగిరి ప్రవీణ్, శ్రీధర్, నర్సింలు, మోహన్, సురేష్, శంకర్, విష్ణు వర్ధన్, సంజీవ ప్రకాష్, తాకి, అర్షద్, సోఫి , రఫీ, పెద్ద బోయ శ్రీనివాస్, నవీన్, రవి శంకర్, కృష్ణ, హనుమంతు, ఆనంద్, భగవంతు రెడ్డి, నరసింహ, శ్రీధర్ సర్గం, సులిగెం సురేష్ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎమ్మెల్యే

## ఉమామహేశ్వరుడిని అభిషేకించిన ఎమ్మెల్యే



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దంపతులు

**అచ్చంపేట, ఉప్పునుంతల, వనపర్తి ప్రతినిధి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** శ్రీశైల క్షేత్రం ఉత్తర ద్వార సన్నిధి అయిన ఉమామహేశ్వర సన్నిధిలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.శుక్రవారం శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శివమాల ధారణ చేసి పాదయాత్ర చేసే స్వాములకు ఆయన అన్న ప్రసాద వితరణ చేయగా, ఆలయ వేద పండితులు దంపతుల ఇద్దరికీ వేద ఆశీర్వాదాలు అందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సుప్రసిద్ధ ఉమామహేశ్వర క్షేత్రం, మహిమాన్వితమైనదని, ఆలయంలోని శివయ్యను అభిషేకిస్తే అనుకున్న కోరికలను నెరవేరుతాయని ఆది నుంచి ప్రతీది ఉందని ఆయన తెలిపారు. శివరాత్రి ముందు ఈ క్షేత్రం భక్తులతో కిటికీటలాడుతుందని, ఇక్కడ గత 21 సంవత్సరాలుగా వచ్చిపోయే శివ భక్తులకు అన్నదాన వితరణ చేస్తున్నందుకు తనకు ఎంతో సంతృప్తిగా ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## మంత్రి పర్యటన సభా స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ

### భద్రత కట్టు దిట్టంపై పోలీసు అధికారులకు ఎస్పీ ఆదేశాలు

**వనపర్తి క్రైమ్,ఫిబ్రవరి21 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వనపర్తి జిల్లాలో శనివారం వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. అందులో భాగంగా కొత్తకోట మండలం సంకిరెడ్డిపల్లి గ్రామ శివారులో నూతనంగా నిర్మించనున్న ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ భూమి పూజ కార్యక్రమానికి విచ్చేయుచున్న సందర్భంగా శుక్రవారం రోజు వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ భద్రతా చర్యల్లో భాగంగా సభా స్థలాన్ని, వాహనాల పార్కింగ్ స్థలాలు, బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా బందోబస్తులో పాల్గొనే పోలీసు అధికారులకు క్షేత్రస్థాయిలో తీసుకోవలసిన భద్రతాపరమైన పలు సూచనలు చేశారు. అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొనే ప్రజాప్రతినిధులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రోటోకాల్ నిబంధనలు పాటించి విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా ఎస్పీ తో పాటు వనపర్తి డిఎస్పి, వెంకటేశ్వరరావు, స్పెషల్ బ్రాంచ్ సిఐ నరేష్ కొత్తకోట ఎస్సై, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే

**వనపర్తి ప్రతినిధి,ఫిబ్రవరి21 ప్రభాతవార్త:** పెద్దమందడి మండలం మోజర్ల ఉద్యాన కళాశాల విద్యార్థులతో శుక్రవారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి మాట్లాడారు.ఈసందర్భంగా ఆయన కళాశాలలో విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధ్యాపకులతో మాట్లాడి ఉద్యాన కళాశాల అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను తయారు చేయాల్సిందిగా వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్,ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, కళాశాల అసోసి యేట్ డీన్ సైదయ్య,అధ్యాపకులు,జడలశంకర స్వామి, జే. శ్రీనివాసు లు, షహనాజ్, ఆయా మండలాల కాంగ్రెస్‌పార్టీనాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉప్పునుంతలలో ఇరుముడి కార్యక్రమం

**ఉప్పునుంతల,ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:**మండల కేంద్రమైన ఉప్పునుంతల శివాలయంలో శుక్రవారం శివ స్వాముల ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు.41రోజులుగా శివ దీక్షతో ఉన్నారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీశైలంలో జరిగే బ్రహ్మోత్సవాలకు పాదయాత్రతో శివ స్వాముల యాత్ర కొనసాగింది.దాదాపు 40 మంది వరకు శివ స్వాములు ఇరుముడి కార్యక్రమం లో పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డిని కలిసిన జి.రవీందర్

**కోయిలకొండ, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జి. రవీందర్ నారాయణపేట జిల్లా బహిరంగ సభకు విచ్చేసిన సీఎం రేవంత్ రెడ్డిని కలిసి మండల సమస్యలను విన్నవించి మండల అభివృద్ధి కోసం వినతి పత్రం సమర్పించారు. కోయిలకొండ మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి విన్నవించారు. జిల్లాకు వచ్చిన సందర్భంగా రేవంత్‌రెడ్డికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జి రవీందర్ ఘన స్వాగతం పలికారు.

## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

**కృష్ణ, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** గుడేబల్లూరు లోని టై రోడ్ లిటిల్ ఏంజెల్ స్కూల్ లో స్వయం పరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఇందులో విద్యార్థి, విద్యార్థినీలు ఉపాధ్యాయులుగా, ఎంఈఓ, డిఓ కలెక్టర్‌గా విధులు నిర్వహించి చాలా అద్భుతంగా ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో లిటిల్ ఏంజెల్ స్కూల్ కరస్పాండెంట్ బి కృష్ణ, ఉపాధ్యాయులు విద్య, మాలమ్మ, బసవరాజ్, సునీల మిగతా ఉపాధ్యాయులు మేనేజ్మెంట్ బి.తిమ్మన్న పాల్గొన్నారు.

## ఆత్మరక్షణ కోసం కరాటే : సింగిల్ విండో

**నారాయణపేట టౌన్, 21 ప్రభాతవార్త :**ఆత్మ రక్షణకోసం కరాటే ఇంతగానో దోహదపడుతుందని సింగిల్ విండో అధ్యక్షుడు పుట్టి ఈదప్ప అన్నారు. శుక్రవారం దామరగిద్ద మండల కేంద్రంలో కరాటే మాస్టర్ నరసింహరాజు ఆధ్వర్యంలో బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. కార్యక్రమం ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఆత్మ రక్షణ కోసం కరాటే ఎంతగానో దోహదపడుతుందన్నారు. చదువుతోపాటు యువకులు క్రీడల్లోనూ రాణించాలన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డులతో పాటు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాల్ రెడ్డి, కన్ని రెడ్డి, ఆనంద్, శ్రీనివాస్, శ్రీకాంత్ గౌడ్, శరణ్ నాయక్‌తో బాటు ఉన్నారు.

### ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న

## మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి దంపతులు

**వనపర్తి క్రైమ్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** 3వ వార్డ్ శ్రీ సీతారామలక్ష్మణ సహిత శ్రీ వీరాంజనేయ స్వామి నూతన ధ్వజస్తంభ, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో మాజీ మంత్రి సింగిరెడ్డి వాసంతి నిరంజన్ రెడ్డి పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణములో జరుగుతున్న యాగంలో పాల్గొన్నారు. వేదపండితులు నిరంజన్ రెడ్డి దంపతులను ఆశీర్వదించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు పి.రమేష్ గౌడ్,వాకిటిశ్రీధర్,బండారు.కృష్ణ,సూర్యవంశం.గిరి,చిట్యాల.రాము, జోహేబ్, ఇమ్రాన్, మునయ్యా, తదితరులు నందిమల్ల అశోక్ పాల్గొన్నారు.

వార్త VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME

★ I Juveriya Fatime D/o Khaja Abdul Khadeer pleased to change my father name as Khaja Abdul Khadeer instead of Khaja Abdula Quadeer in my passport. (Ro.No. 43718)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.



ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రికను అందచేస్తున్న దృశ్యం

## ఆలయ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** పట్టణ శివారులోని వెంకటాపూర్ చౌరస్తాలో నూతనంగా నిర్మించిన శ్రీభక్త మార్కండేయ మహాదేవాలయం ప్రారంభోత్సవ వేడుకలకు హాజరుకావాలని పద్మశాలి సంఘం బాధ్యులు వైదిక పురోహితులు గురురాజుశర్మ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డిలకు శుక్రవారం ఆహ్వానపత్రికలను అందచేశారు. మార్చి 3వ తేదీ నుంచి 6వ తేదీవరకు ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ బాధ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించాలని ఎమ్మెల్యేకు వినతి చేశారు.

## బీమా చట్టసవరణ బిల్లును వ్యతిరేకించాలి

**-ఎల్ఐసి బిహెచ్ఈఎల్ ఎఐఐఈఎ అధ్యక్షురాలు**



నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

**రామచంద్రాపురం, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** బీమా చట్టసవరణ బిల్లు 2024ను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఎల్ఐసి బీహెచ్ఈఎల్ శాఖ ఏఐఐఈఏ అధ్యక్షురాలు తిరుమలదేవి, ప్రధాన కార్యదర్శి గీత స్వామినాథన్, ఉమెన్ సబ్ కమిటీ సభ్యురాలు సుబ్రమనియన్ డిమాండ్ చేశారు. బీహెచ్ఈఎల్ ఎల్ఐసి కార్యాలయం ఎదుట ఉద్యోగులు గంట పాటు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుదూ ఎల్ఐసిలో సిఐ త్రీ, సిఐ ఫోర్ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఏఐఐఈఏకు గుర్తింపు ఇవ్వాలని కోరారు. బీమా ప్రీమియంపై జీఎస్టీ రద్దు చేయాలన్నారు. భీమా రంగంలో విదేశీ పెట్టుబడి పరిమితి 74 శాతం నుంచి 100 శాతం పెంచడం, భీమా కంపెనీలకు కంపోసిట్ లైసెన్స్‌ల జారీ, భీమా నిధుల మళ్లింపు, కమీషన్ చెల్లింపులో అస్పష్టత, పాలసీదారుల డేటాకు రక్షణ లేకపోవడం, మూలధనంలో లోటు వంటి అనైతిక ప్రమాదాలను వ్యతిరేకిస్తూ సమ్మెను నిర్వహించడం జరిగిందన్నారు. ప్రభుత్వరంగ బీమా పరిశ్రమ రక్షణకు జరిగే ఈ పోరాటంలో ప్రజలందరూ భాగస్వాములుకావాలని, ఉద్యమానికి మద్దతు అందించాలని వినతి చేశారు.

## నేటి నుంచి పోచమ్మ తల్లి జాతర ఉత్సవాలు



దేవాలయ పరిసరాలను పరిశుభ్రం చేయిస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీలో కొలువున్న పోచమ్మతల్లి దేవాలయంలో(గోల్డెన్ టెంపుల్) ఈ నెల 22వ తేదీ నుంచి జాతర ఉత్సవాలు ప్రారంభం కానునందున శుక్రవారం కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ సొంత నిధులను వెచ్చించి జిహెచ్ఎంసి సిబ్బందితో కలిసి ఆలయ పరిసరాలను పరిశుభ్రం చేయించారు. ఉత్సవాలను పురస్కరించుకుని విద్యుత్ దీపాలంకరణ పూర్తిచేయిస్తామన్నారు. జాతర ఉత్సవాలకు చేరుకునే భక్తులకు ఇబ్బందులు కలగకుండా తగు ఏర్పాట్లుచేస్తామన్నారు. ఇదిలాఉండగా కాలనీలోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో జాతర ఏర్పాట్లు పూర్తిచేయాలని జిహెచ్ఎంసి అధికారులను ఫోన్‌లో ఆదేశించారు. కార్య క్రమంలో సీఎం మల్లేష్, సంజీవ, కృష్ణ, శ్రీను, నిఖిల్ హన్మంతు పాల్గొన్నారు.

## నూతన ఎంపిడిఓకు పంచాయతీ కార్యదర్శుల సన్మానం



నూతన ఎంపిడిఓను సన్మానిస్తున్న పంచాయితీ కార్యదర్శులు

**చౌటకూరు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** మండలంలో ఎంపిడిఓగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన శంకర్‌ను మండలంలోని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్బంగా పదవీ బాధ్యలు చేపట్టిన శంకర్ మాట్లాడుతూ ప్రజలు ఇబ్బందులు పడకంగా చర్యలు తీసుకోవాలని, వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకుని తాగునీటి కోసం అవస్థలు పడకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిఓ శ్రీకాంత్, జూనియర్ అసిస్టెంట్ ప్రీతం, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## తాగునీటి కోసం సూర్యా తండాలో ఆందోళన

**సిర్గాపూర్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** మండల పరిధిలోని సుర్యాతండాలో తాగునీటి కోసం శుక్రవారం తండావాసులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వంకర్, భీమ్‌రావు మాట్లాడుతూ వేసవి కాలం ఆరంభానికి ముందే తండాలో నీటిఎద్దడి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ నీరు తండాకు సరఫరా కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారం రోజుల క్రితం నిల్వ చేసుకున్న నీటినే తాగాల్సి వస్తోందని చెప్పారు. గ్రామంలో తాగునీటి సమస్యతోపాటు రోడ్డు దుస్థితి అధ్వానంగా ఉందని దుయ్యబట్టారు అధికారులు, పాలకులు స్పందించి తండాలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## విద్యార్థినికి సైకిల్‌ను బహూకరించిన ఉపధ్యాయుడు

రేగోడ్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:
మండల కేంద్రమైన రేగోడ్ గ్రామానికి చెందిన ఇజారి నరేష్ ఇటీవల ఎస్జీటీ ఉపాధ్యాయులుగా నియమితులై మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో విధులు నిర్వహిస్తున్నారు. వెంకటాపురం గ్రామానికి చెందిన ఎం. శ్రావణి అనే 8వ తరగతి విద్యార్థిని ప్రతిరోజు 3 కిలో మీటర్ల దూరంలో గల రేగోడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పాఠశాలకు తాను పని చేస్తున్న పాఠశాల ముందు నుండి ప్రతి రోజు నడుచుకుంటూ రావడం చూసి ఆ అమ్మాయి చదవడానికి పడుతున్న కష్టాన్ని చూడలేక తన సొంత డబ్బులతో ఆ అమ్మాయికి సైకిల్‌ను మండల విద్యాధికారి గురునాథ చేతుల మీదుగా శుక్రవారం అందించడం జరిగింది. విధుల్లో చేరిన వెంటనే సేవాభావం కనబరిచిన ఉపాధ్యాయుడు నరేష్‌కు మండల విద్యాధికారి, తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

# హామీలు మరిచి ప్రజలను వంచిస్తున్న కాంగ్రెస్

**మాజీ ఎంపి బిబి పాటిల్**



మాట్లాడుతున్న మాజీ ఎంపి బిబి పాటిల్

**చౌటకూరు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** హామీలను అమలు చేయడం మరిచి ప్రజలను వంచిస్తున్న కాంగ్రెస్ పార్టీకి ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో గుణపాఠం తప్పదని మాజీ ఎంపి బిబి పాటిల్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తాడ్దానిపల్లి చౌరస్తాలో బిబి పాటిల్ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా చేసిన 6 గ్యారంటీలను అధికారంలోకి రాగానే అమలు చేయడం మరిచిపోయిన కాంగ్రెస్‌క గుణపాఠం తప్పదన్నారు. చేసిన హామీలనే అమలు చేసే దిక్కు లేకుండా పోయిందని ఇక కొత్త పథకాలను ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నించారు. ఉద్యోగులకు ఆపత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామన్న కాంగ్రెస్‌కు ఆ ఊసే ఎత్తడం లేదని ఎద్దేవ చేశారు. దేశ రాజదాని ఢిల్లీలో జరిగిన జరిగిన శాసన సభ ఎన్నికల్లో సైతం 7 గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసేందుకు యత్నించిన కాంగ్రెస్‌కు ఓటు రూపంలో ప్రజలు తగు రీతిలో బుద్ది చెప్పారని, ఆ ఫలితాలే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పునరావృతం కానున్నాయన్నారు. ఈ నెల 27న జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పేందుకు పట్టభద్రులు, ఉపాధ్యాయులు సిద్దంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంత రావు కులకర్ణి, నాయకులు ఏ.వెంకటనరసింహా రెడ్డి, మురళీధర్‌యాదవ్, పల్వట్ల జగదీశ్వర్, నవీన్ కుమార్, ప్రవీణ్‌కుమార్, సార రాజ్‌కుమార్, పుట్టి మోహన్, చందాపురం ముకుందం ఉన్నారు.



మాజీ మున్సిపల్ పాలకవర్గాన్ని సన్మానిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

## ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డికి రుణపడి ఉంటాం

**మాజీ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహాగౌడ్**

**అమీన్‌పూర్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న మంచినీటి సమస్యకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శాశ్వత పరిష్కారం అందించారని తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ పాండు రంగారెడ్డి, తాజా మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్‌లు తెలిపారు. శుక్రవారం జీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అమీన్‌పూర్ మున్సిపాలిటీ తాజా మాజీ పాలకవర్గాన్ని ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తాజా మాజీ చైర్మన్ పాండు రంగారెడ్డి, తాజా మాజీ వైస్ చైర్మన్ నర్సింహా గౌడ్‌లు మాట్లాడుతూ ఐదేళ్లపాటు తమకు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సహాయ సహకారాలతో అమీన్‌పూర్ మున్సిపాలిటీని అని రంగాల్లో అభివృద్ధి చేశామని చెప్పుకొచ్చారు. ముఖ్యంగా మంచినీటి సమస్యకు ఎమ్మెల్యే శాశ్వత పరిష్కారం అందించడం జరిగిందని, దీనికి గాను జీవితాంతం ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డికి రుణపడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు

**వెల్దుర్తి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన మాసాయిపేట రైతు వేదికలలో శుక్రవారం పౌరసరఫరాల శాఖ ద్వారా వరి విత్తనాల నాణ్యత ప్రమాణాల గురించి ఏడీఏ పుణ్యవతి, ఏవో రామ శివరావు, తహశీల్దార్ జ్ఞాన జ్యోతిలు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి కోత కోసేటప్పుడు హార్వెస్టర్ ఆర్పీఎం 1800-2100 మధ్యలో ఉండాలని అన్నారు. రైతులు వరి ధాన్యాన్ని కల్లాల దగ్గరే పోసుకొని ఆరబెట్టుకోవాలని, వడ్లు కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన తర్వాత తేమ శాతం 17 కంటే తక్కువ ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు రజిత, కిరణ్, రైతులు పాల్గొన్నారు.

**వరి పంటల పరిశీలన..**

మాసాయిపేట శివారులోని వరి పంట పొలాలను ఏడీఏ పుణ్యవతి, ఏవో రామ శివరావు, తహశీల్దార్ జ్ఞాన జ్యోతిలు పరిశీలించడం జరిగింది. వరి పంటలో కాండం తొలుచు పురుగు ఉధృతి అధికంగా ఉన్నందున కార్టాప్ హైడ్రో క్లోరైడ్ 400 గ్రాములు/ఎకరాకు లేదా క్లోరంట్రా నీలిప్రోల్ 60 ఎంఎల్/ఎకరాకు చొప్పున స్ప్రే చేసుకోవడం వల్ల ఈ పురుగు ఉధృతిని తగ్గించవచ్చని, అదేవిధంగా అగ్గి తెగులు గమనించినట్లయితే ట్రై సైక్లోజేల్ + మాంకోజెబ్ 500 గ్రాములు/ఎకరాకు పిచికారీ చేయాలని సూచించారు.

## నకిలీ ఎరువులు అమ్మితే చర్యలు తప్పవు : ఏడిఎ

**వెల్దుర్తి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** రైతులకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని, నకిలీ ఎరువులు అమ్మితే చర్యలు తప్పవని వ్యవసాయ శాఖ ఏడీఏ పుణ్యవతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన వెల్దుర్తిలోని పీఏసీఎస్ ఫర్టిలైజర్ గోదాంలో కౌడిపల్లి ఏడిఏ పుణ్యవతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫర్టిలైజర్‌లోని స్టాక్‌ను పరిశీలించరు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఎరువులు ఉన్నాయని, ఎవరు కూడా ఇబ్బంది పడాల్సిన అవసరం లేదన్నారు. ఎవరైనా ఫర్టిలైజర్ దుకాణాదారులు నకిలీ విత్తనాలు అమ్మితే వారి పైన కఠిన చర్యలు తప్పవని అన్నారు.

## 40 పడకల సిజేరియన్ పోస్ట్ సర్జికల్ వార్డు మంజూరు

**జహీరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న మాత శిశువు సంరక్షణ వైద్య ఆరోగ్య ఆసుపత్రి నిర్మాణ పనులను రాష్ట్ర సెట్విన్ చైర్మన్ యన్ గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సిద్దం ఉజ్వల్‌రెడ్డిలు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గిరిధర్‌రెడ్డి, సిద్దం ఉజ్వల్‌రెడ్డి మాట్లాడుతూ ఆసుపత్రి డాక్టర్లు శ్రీధర్, కిరణ్మయిల వినతి మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి దామోదర్‌కు మాత శిశువు సంరక్షణ వైద్య ఆరోగ్య ఆసుపత్రికి 40 పడకల సిజేరియన్ పోస్ట్ సర్జికల్ వార్డు మంజూరుకు వినతి చేయగా మంత్రి మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. మాత శిశువు సంరక్షణ వైద్య ఆరోగ్య ఆసుపత్రికి 40 పడకల సిజేరియన్ పోస్ట్ సర్జికల్ వార్డు మంజూరు కావడం పట్ల ఆసుపత్రి వైద్యులు మంత్రి దామోదర్‌కు, అందుకు సహకరించిన గిరిధర్‌రెడ్డి, డాక్టర్ సిద్దం ఉజ్వల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఉచిత వైద్య శిబిరంలో 300 మందికి వైద్య సేవలు

**సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని రైతు బజార్ ఎదురుగా ఉన్న సాహితి ఆసుపత్రిలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు. ఆసుపత్రి ఆధ్వర్యంలోఉదయం10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి చేరుకున్న 5 వందలకు పైగా మందికి న్యూరాలజిస్ట్ డాక్టర్ పవన్‌కుమార్, ఆర్థోపెడిక్ స్పెషలిస్ట్ డాక్టర్ అబ్దుల్‌రావుఫ్, జనరల్ ఫిజిషియన్ డాక్టర్ శ్రీనివాస్‌లు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ సాహితీ రాము మాట్లాడుతూ ప్రతి శుక్రవారం న్యూరోకు సంబంధితుచత వైద్య పరీక్షలు నిర్వహిస్తామని, ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

**-కొండాపూర్ గ్రామ సభలో తీర్మానం**

**రేగోడ్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** మండలంలోని కొండాపూర్ గ్రామ పంచాయతీలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. రైతులు పండించిన పంటలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, అలాగే పంటలను నమోదు చేసుకోవాలని సూచించారు. కొండాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేస్తే కొండాపూర్, జెగిర్యల, ఆర్.ఇటిక్యాల గ్రామాల రైతులకు అందుబాటులో ఉంటుందని రైతులు తెలపడంతో వ్యవసాయ అధికారులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు తీర్మాణం చేశారు. మండల వ్యవసాయ అధికారి జావేద్‌ను ఫోన్ ద్వారా సంప్రదించగా డీసీవో కరుణాకర్ వచ్చారని వారికి వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ దశరథ్, అశోక్, మాజీ సర్పంచ్ పాండరి, రైతులు బస్వరాజు. మచ్చేందర్ రావు, లింగప్ప, నర్సింహులు, నర్సప్ప, సుభాష్, ఆంజనేయులు, వీరప్ప, సాయిలు పాల్గొన్నారు.

## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



ఉపాధ్యాయులైన విద్యార్థులు

**పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** మండల పరిధిలోని మల్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. కార్యక్రమంలో డీఈవోగా ఆంజనేయులు, ఎంఈవోగా శివకుమార్, ప్రధానోపాధ్యాయులుగా నరసింహగౌడ్, ఉపాధ్యాయులుగా సుస్మిత, వైష్ణవి, తుకారం, పరుశురాం, చిరంజీవి, మురళీకృష్ణ, రాజు, లోకేష్‌లు వ్యవహరించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుష్మ, ఉపాధ్యాయులు ఆనంద్, స్రవంతి, సచిన్ కుమార్‌లు పర్యవేక్షించారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**రామాయంపేట మున్సిపాలిటీ, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** రామాయంపేట మండలం రాయిలాపూర్ గ్రామానికి చెందిన గజం చంద్రం 108 అంబులెన్స్ వాహనంలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల మరణించాడు. తోటి ఉద్యోగి మరిణించడంతో వారి కుటుంబానికి అండగా ఉండే లక్ష్యంతో తెలంగాణ 108 ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నాడు చంద్రం కుటుంబ సభ్యులకు రూ.20,200 రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈఎంటి శ్రీనివాస్ గౌడ్, జాకప్, ఫ్రాన్సిస్ స్వామి, పైలట్ రమేష్, దుర్గాప్రసాద్, సర్సింహ, ఆసిఫ్ పాల్గొన్నారు.

## ఎల్లలింగ ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే

**నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** మండల పరిధిలోని అవుదాపూర్ గ్రామంలో కొనసాగుతున్న ఎల్లలింగ ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేను మచ్చ ధర్నా మహారాజ్ ఆశీర్వచనాలు చేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



అవుదాపూర్‌లో ఎల్లలింగ ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

# డంపింగ్ యార్డు నిలిపివేసే వరకు ఉద్యమించాలి : ఎమ్మెల్యే




మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

**నర్సాపూర్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** డంపింగ్ యార్డు నిర్మాణాన్ని నిలిపివేసే వరకు ఉద్యమించాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. శుక్రవారం ప్యారానగర్‌లో నిర్మిస్తున్న డంప్ యార్డు నిలిపివేయాలని నర్సాపూర్‌లో జేఏసి ఆధ్వర్యంలో తలపెట్టిన రిలే నిరసన దీక్ష 5 రోజుకు చేరుకున్నాయి. అఖిల పక్ష నాయకుల సమ్మెకు మద్దతుగా ఎమ్మెల్యే సునీతారెడ్డి దీక్షా శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డంపింగ్ యార్డుతో నర్సాపూర్ నియోజకవర్గానికి శాపంగా మారుతుందని పచ్చని అడవిలో చిచ్చు పెట్టినట్లు అవుతుందని అన్నారు. ప్రతి ఆదివారం హైదరాబాద్ నగరం నుండి ఎంతో మంది స్వచ్ఛమైన గాలికోసం ప్రతీ ఒక్కరు సెదతీరడానికి వస్తుంటారు, అలాగే రాయరావు చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం వుందన్నారు, ఆరోగ్య పరంగా చాలా నష్ట పోవాల్సి వుంటుందని, అలాగే చుట్టు పక్కల గ్రామాల చెరువులోని చాపలు మరణించడం జరుగుతుందని అన్నారు. ఇందుకోసం రాజకీయ పార్టీలకతీతంగా అన్ని పార్టీలు ఏకమై డంపింగ్ యార్డు ను నిలిపివేసే వరకు పోరాడాలన్నారు, ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు దుర్గప్పగారి సత్యంగౌడ్, గోద రాజేందర్, బిక్షపతి, సద్దాం, విశ్రాంత ఉద్యోగులు సిరుమని గంగారాం, కృష్ణ స్వామి, యాకూబ్, సత్యానారాయణ, దన్‌సింగ్, గోపి, ప్రభు, భూషణం, మనయ్య, యేసురత్నం, నాయకులు నర్సింగ్ రావు, గంగపుత్రులు దుర్గేష్, దుద్యాల యాదయ్య, తదితరులు పాల్గొన్నారు



భద్రాచలం నుండి వచ్చిన గోటి తలంబ్రాలతో నర్సారెడ్డి తదితరులు

## గజ్వేల్‌కు చేరుకున్న భద్రాచలం గోటి తలంబ్రాలు

**గజ్వేల్, ఫిబ్రవరి 21 (ప్రభాతవార్త):** భద్రాచల సీతారాముల వారి కళ్యాణానికి గోటిలో ఒలిసిన తలంబ్రాలు వాడతారు. శుక్రవారం భద్రాచలం నుంచి 250 కిలోల వడ్లు గజ్వేల్‌లోని శ్రీరామకోటి భక్త సమాజం సంస్థకు అందగా వాటికి రామాలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పాల్గొన్నారు. గజ్వేల్ ప్రాంతానికి ముచ్చటగా మూడోసారి గోటి తలంబ్రాలు తీసుకురావడం, రామకోటి సంస్థకు అవకాశం ఇవ్వడం రామరాజు భక్తికి నిదర్శనమన్నారు. గత 26 సంవత్సరాల కృషిని భద్రాచల దేవస్థానం గుర్తించి రామకోటి రామరాజును సన్మానించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ నరేందర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ ఎన్‌సి.రాజమౌళి, ఆకుల నరేష్‌బాబు, ఏఎంసి వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, ఊడెం శ్రీనివాస్‌రెడ్డి, జంగం రమేష్‌గౌడ్, కృష్ణాలయం ప్రతినిధులు యెలగందుల రామచంద్రం, ఉప్పల వెంకటేశం, దూబకుంట మైత్రాములు, అత్తెల్లి లక్ష్మయ్య, గుంటుకు శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చక్రియాల్‌లో విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

**చౌటకూరు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** మండలంలోని చక్రియాల్ గ్రామంలోని అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం గ్రామానికి చెందిన యువనాయకులు చిన్నరోళ్లపాటి రాజశేఖర్ ఆధ్వర్యంలో పంపిణిచేశారు. ఈసందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు సహాయం చేయడం ఆనందంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను అందుకోవాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులకు సహకారం అందచేసిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కొత్తోల్ల సత్తయ్య, నీరుడి కిష్టయ్య, చిట్కుల నాగేష్, మైసగొని శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## అల్లబకాస్‌ను స్మరించుకున్న శివస్వాములు

**మనూర్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** కఠోర దీక్షతో పూజా కార్యక్రమాలు, దిన చర్యను నిర్వహించే శివస్వాములకు బిక్ష (అన్నదానం)ను ఏర్పాటుచేసే అల్లబకాస్ పటేల్ సేవలను శివస్వాములు స్మరించుకున్నారు. మండల పరిధిలోని బాదలగౌవ్ గ్రామానికి చెందిన సయ్యద్ అల్లబకాష్ పటేల్ గత కొన్ని సంవత్సరాలుగా శివస్వాములకు క్రమ తప్పకుంఠ బిక్షను ఏర్పాటు చేస్తూ వస్తున్న అల్లబకాష్ పటేల్ గత కొన్ని రోజులి క్రితం కానరానిలోకాలకు చేరిపోయారు. శివస్వాములు మహాశివరాత్రి పర్వదినాన్ని పురష్కరించుకుని దీక్షలు తీసుకుని ఉన్నారు. ప్రతి సంవత్సరం అల్లాబకాస్ ఒక రోజు తమకు బిక్షను పెట్టించేవారని శుక్రవారం గ్రామంలో బిక్షను స్వీకరిస్తున్న శివస్వాములు అల్లాబకాస్ పటేల్ సేవానిరతిని గుర్తుచేసుకుంటూ శివస్వాములకు బిక్షను ఏర్పాటు చేసినట్లు మాజీ సర్పంచ్ వినోద్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో గురుస్వాములు వెంకట్‌రాంరెడ్డి, డాక్టర్ అమృత, అంజిగొండ, శివ స్వాములు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి చైర్మన్ ఆర్థిక సహకారం

**సిర్గాపూర్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ఎల్లమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి జిఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుట్టపు మచ్చేందర్ శుక్రవారం ఆర్థిక సహాయాన్ని అందచేశారు. కార్యక్రమంలో సిర్గాపూర్ మండల మాజీ జడ్పీటిసి సభ్యులు రాఘవరెడ్డి మాజీ ఎంపిటిసి సభ్యులు అమరే నాయక్, బిఆర్ఎస్ యూత్ అధ్యక్షులు రాజుగౌడ్, గౌడ సంఘం ఉపాధ్యక్షులు రాజుగౌడ్, ప్రవీన్‌గౌడ్, క్రిష్ణాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మద్దతు పలకండి

**-కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శేషారెడ్డి**

**అల్లాదుర్గం, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ బలపర్చిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డికి పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి మద్దతు పలకాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శేషారెడ్డి పట్టభద్రులకు వినతి చేశారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఓటుహక్కు ఉన్న పట్టభద్రులకు శేషారెడ్డి ప్రత్యక్షంగా కలుసుకుని నరేందర్ రెడ్డికి మద్దతు పలకాని సూచిస్తుండటంతోపాటు నాయకులకు ఓటు హక్కు ఉన్న వారి వివరాలను పంపి ఓటును కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి వేసేలా చూడాలని మండల నాయకులకు శేషారెడ్డి సూచించారు.

## ముప్పారంలో ఘనంగా స్వయం పాలన



ముప్పారం యుపిఎస్‌లో స్వయం పాలన జరుపుకుంటున్న విద్యార్థులు

**అల్లాదుర్గం, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ముప్పారం గ్రామంలోని యుపిఎస్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఆనందోత్సవాలతో ఘనంగా జరుపుకున్నారు. తమతో చదువుకుంటున్న విద్యార్థులకు ఒక రోజు ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు పాఠాలు భోధించడం ఆకట్టుకుంది. పాఠశాల పక్కలో గల అంగన్‌వాడి కేంద్రంలోనూ స్వపరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. అంగన్‌వాడి టీచర్‌గా, ఆయగా విద్యార్థులు వేషాధారణ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగలక్ష్మి, ఉపాధ్యాయులు రాకేష్, ముప్పారం గిరిజన తండా ఉపాధ్యాయులు రవి, అంగన్‌వాడి టీచర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## జహీరాబాద్‌లో శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన ఆర్ఎం

**జహీరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ జహీరాబాద్ డిపోలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను శుక్రవారం రీజినల్ మేనేజర్ ప్రభులత సందర్శించారు. శిక్షణ పొందుతున్న ఉద్యోగులకు ఆర్ఎం పలు సూచనలు చేశారు. టీం వర్క్‌తో పనులను సులభంగా పూర్తి చేయవచ్చన్నారు. ప్రయాణీకులతో మసులు కునే తీరుపై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా ఉండేదుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. శిక్షణ పొందుతున్న ఉద్యోగులతో కలిసి ఆర్ఎం ప్రభులత మధ్యాహ్న భోజనం ఆరగించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ జాకీర్ హుస్సేన్, అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్, గ్యారేజ్ ఇంచార్జి తిరుమలేష్ తదితరులు పాల్గొనగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు ఆర్ఎం ప్రభులత ఘనంగా సన్మానించి అభినందించారు.



ప్రతిభ చాటిన ఆర్టీసి ఉద్యోగులను సన్మానిస్తున్న ఆర్ఎం ప్రభులత